Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)
స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు · స్థాపితం: 1930
Longest Living Newspaper in Telugu Journalism

# జమీన్ రైతు

సంపుటి: 80 • సంచిక: 53 • 18-12-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

ఇందిర
దంతవైద్యశాల
నెల్లూరు. సెల్: 99083 22007

కేర్
సూపర్ స్పెషాలిటీ దంతవైద్యశాల
MDS.
Professor Endodontics
నెల్లూరు - ఫోన్ : 2303300

### మిగిలింది రెండంటే రెండు మార్గాలు

# రాష్ట్రపతి పాలనా? ఎన్నికలా?

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు, కెసిఆర్ ఆమరణ దీక్ష ప్రహసనం, ఎమ్మెల్యేల పదవీ గండంగా పరిణమిస్తున్నది. ఎన్నికలు జరిగి ఏడు నెలలు కూడా కాకముందే తమ పదవులు వుంటాయో, వూడతాయో అర్ధం కాని అయోమయంలో పడిపోతున్నారు వారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ మొదలౌతున్నదని చిదంబరం ప్రకటించిన ముహూర్తం ఎంత గొప్పదో కానీ, ఆ ఒక్క మాటతో రాష్ట్ర రాజకీయ పరిస్థితులు తలక్రిందులుగా మారిపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్ ఒక రాజకీయ అగ్నిగుండంగా తగలబడుతున్నది. ప్రతి ఊరూ ఒక యజ్ఞవాటిక వలె ఉద్యమ జ్వాలలు వెదజల్లుతున్నది. ఆ సెగ ఢిల్లీ వరకు తాకుతున్నది. దేశాన్ని ఏలే పాలకులను కూడా ఉక్కిరి బిక్కిరి చేస్తున్నది.

తెలంగాణ ఇస్తామని చెప్తే, కోస్తాలో మంటలు అంటుకొంటాయని ఏ మాత్రం వూహించలేదు కాంగ్రెస్ అధినాయకత్వం. ఆ మాటకొస్తే ఎవరి ఆలోచనలకూ అందలేదు ఈ పరిణామం. చిదంబరం ప్రకటన వెలువడిన తెల్లారి, శాసన సభలో గంభీర వాతావరణం అలముకొన్నది. కోస్తా, రాయలసీమ ఎమ్మెల్యేలు షాక్‌కు గురైన వారి వలె బిత్తరచూపులు చూస్తూ కన్పించారు. ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, ఎమ్పీ పదవికి లగడపాటి రాజగోపాల్ రాజీనామా వార్త సీమ టపాకాయ వలె పేలింది. దాన్ని విని జెసి దివాకర్‌రెడ్డి, డిఎల్.రవీంద్ర రెడ్డి తమ రాజీనామాలు ప్రకటించారు. అంతే, ఒక్కసారిగా భూమి బ్రద్ధలైనట్లు ఎమ్మెల్యేలంతా రాజీనామాలకు క్యూ కట్టారు. వీరిని చూసి వారు, వారిని చూసి వీరు, అన్ని పార్టీల వారూ అదే వరసలో నిలబడ్డారు. అంతా గందరగోళం, అయోమయం, ఏమి జరుగుతున్నదో తెలియని అనిశ్చితస్థితి. మరొకప్రక్క కోస్తాఆంధ్ర, రాయలసీమలలో నిరసన ఉద్యమాలు భగ్గుమన్నాయి. ఎవరూ పిలుపు ఇవ్వకుండానే, ఎవరి నాయకత్వం కోరకుండానే, ఎవరూ వెళ్లి జనాన్ని సమీకరించకుండానే ఎక్కడికక్కడ ధర్నాలు, దహనాలు, ప్రదర్శనలు, అల్లర్లు, ఆగభాగాలు చెలరేగాయి. రాష్ట్రం మొత్తం స్తంభించిపోయింది. సాక్షాత్తు తిరుమల వెంకటేశ్వరస్వామి గుడి కూడా భక్తులు లేక వెలవెల పోయింది. అనూహితంగా విద్యార్థులు ఉద్యమంలోకి ఒక ఉప్పెన వలె వచ్చి పడ్డారు. అన్ని విశ్వవిద్యాలయాలూ ఉద్యమ కేంద్రాలుగా మారిపోయాయి. వారి మీద పోలీసు లాఠీలు విరిగాయి.




#### రెండువైపుల పదునున్న కత్తి

ఒకదానివెంట ఒకటిగా వెంట వెంటనే జరిగిపోయిన ఈ పరిణామాలు ఇటు రోశయ్య ప్రభుత్వాన్ని, అటు కాంగ్రెస్ అధినాయకత్వాన్ని నివ్వెరపరచాయి. ఏమి చేయాలో వారికి తోచ లేదు. ఇప్పటికీ అదే పరిస్థితి. కరవమంటే కప్పకు కోపం, విడవమంటే పాముకు కష్టం అన్నట్లు తెలంగాణ ఇచ్చే ప్రక్రియను ఆపుతున్నామంటే, అక్కడ ఆందోళనలు భగ్గుమనే పరిస్థితి. దాన్ని కొనసాగించక తప్పదని నచ్చ చెప్దామంటే కోస్తా, రాయలసీమ వాసులు మాట విన్పించుకొనే ధోరణిలో లేరు. రెండు వైపులా పదునున్న కత్తి వలె తయారైంది ఈ సమస్య. చాలా సున్నితంగా మారింది. ఎటూ చెప్పలేని, ఏమీ చేయలేని సందిగ్ధంలో పడిపోయింది అధిష్టానం. ఏ మాట చెప్తే ఏ అనర్థం ముంచుకొని వస్తుందో అని భయపడే పరిస్థితి.

#### ఇంత ధిక్కారం చరిత్రలో లేదు

కాంగ్రెస్ అధిష్టానం అంటే, హిట్లర్ నియంతృత్వంతో సమానమని అందరి భావన. అక్కడ నుంచి ఒక మాట వస్తే దేశం మొత్తం మీద ఎవరూ దాన్ని ధిక్కరించే పరిస్థితి వుండదని, ధిక్కరించిన వారికి రాజకీయంగా పుట్టగతులు వుండవని చెప్తారు. కానీ ఈసారి మాత్రం అందుకు విరుద్ధంగా జరిగింది. అధిష్టానం చేసిన ప్రకటనను తిరస్కరించడానికి కాంగ్రెస్ ఎమ్పీలు, ఎమ్మెల్యేలు పోటీలుపడ్డారు. సోనియా గాంధీ స్వయంగా పిలిచి, శాంతి వచనాలు పలికినా ఎమ్పీలు విన్పించుకోలేదు. తమ మాటే నెగ్గాలని హఠం పట్టి వున్నారు. కాంగ్రెస్ చరిత్రలో ఇంతటి ధిక్కార స్వరం ఎప్పుడూ లేదు.

#### అందరూ మోసం చేశారు

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని రాజకీయ పార్టీలూ

కొరవ 14వ పేజీలో

### కార్టూన్ స్కేప్




సార్‌కి సంతోషించాలో... బాధపడాలో అర్థం కావట్లేదట.

# జగన్ స్వంత పార్టీ!

రాష్ట్ర విభజన వివాదం, రాష్ట్ర రాజకీయ స్వరూప స్వభావాలను సమూలంగా మార్చేస్తున్నది. కొత్త కొత్త పరిణామాలకు శ్రీకారం చుడుతున్నది. కొంగ్రొత్త ఆశలను ప్రేరేపిస్తున్నది. వైఎస్ జగన్ స్వంత పార్టీ ప్రతిపాదన వాటిలో అతి ముఖ్యమైనది. వైఎస్ మరణం తర్వాత ముఖ్యమంత్రి పీఠం వారసత్వ హక్కుగా భావించిన జగన్, దాన్ని సాధించుకోవడం కోసం చేయని ప్రయత్నం లేదు. కానీ కాంగ్రెస్ అధిష్టానం ఆయన్ను నిర్దాక్షిణ్యంగా తిరస్కరించింది. కనీసం పులివెందుల నుంచి పోటీ చేయడానికి టిక్కెట్ కూడా ఇవ్వలేదు. ఆ ఆశాభంగాలను మనసులోనే దిగమింగుకొని, తనలో తాను కుమిలిపోవడం తప్ప ఏమీ చేయలేకపోయాడు. కాంగ్రెస్ అధిష్టానాన్ని ధిక్కరిస్తే రాజకీయంగా పుట్టగతులు వుండకపోవడమే కాదు, వేలకోట్లకు విస్తరించిన వ్యాపార సామ్రాజ్యానికి మరణ శాసనం అవుతుందన్న భయంతో మౌనంగా వుండిపోయాడు. రాష్ట్ర విభజన వివాదంతో ఆయనకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. కొత్త ఆశలు చిగురించాయి. తెలంగాణ ఇచ్చినా, ఇవ్వకపోయినా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ రాజకీయ ఉనికి ప్రశ్నార్థకమన్నది జగన్ భావన. చాలామంది కాంగ్రెస్‌వాదులలో ఇదే అభిప్రాయం ఏర్పడుతున్నది. అటు తెలంగాణలో, ఇటు ఆంధ్ర ప్రాంతాలలో అల్లర్లు, ఆందోళనలు మిన్నంటుతున్నందువల్ల ప్రస్తుత శాసనసభ ఎంతోకాలం మనుగడ సాగించగలదన్న నమ్మకం నశిస్తున్నది. ఏ రోజైనా ఎన్నికలు ముంచుకొని రావచ్చుననే వదంతులు

కొరవ 14వ పేజీలో

# ద్వేషాలు వద్దు

ప్రత్యేక తెలంగాణ ఉద్యమం దారి తప్పుతున్నది. తిరగకూడని మలుపు తిరుగుతున్నది. తెలంగాణ, ఆంధ్ర భేదాలు రాజకీయ వివాదాల స్థాయి నుంచి సాధారణ ప్రజా జీవితంలోకి చొచ్చుక పోతున్నాయి. జగడాలుగా మారుతున్నాయి. ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ప్రజారాజ్యం అధినేత చిరంజీవి సమైక్యాంధ్ర పట్ల సానుకూలత వ్యక్తం చేశాడన్న కినుకతో తెలంగాణ జిల్లాలలో రామచరణ్ తేజ, అల్లు అర్జున్ సినిమాలు ప్రదర్శిస్తున్న హాళ్ల ముందు ఆందోళన చేస్తున్నారు విద్యార్థులు. శాసనసభ వద్ద బందోబస్తు డ్యూటీలో వుండిన ఇద్దరు పోలీసు అధికారులు ఆంధ్ర, తెలంగాణ వాదన పెట్టుకొని, కొట్టుకొనే వరకు వెళ్లారు. సెక్రటరియేట్‌లో తమ వద్దకు ఏ ఫైల్ వచ్చినా ఇది ఆంధ్రాదా, తెలంగాణదా అని విడదీసి చూస్తున్నారు సిబ్బంది. గుమస్తా స్థాయి నుంచి, ఐఎఎస్ అధికారుల వరకు ఈ చర్య నడుస్తున్నది. తెలంగాణ జిల్లాలకు కొన్ని దశాబ్దాల క్రితమే తరలివెళ్లి వ్యవసాయంలోనూ, చిన్నచిన్న వ్యాపారాలలోనూ స్థిర పడిన వారు బ్రతుకు భయానికి లోనౌతున్నారు. తమ ఆస్తులకు రక్షణ వుంటుందా, వుండదా అన్న అయోమయంలో బితుకు బితుకుమంటున్నారు.

పదేళ్లకు పైగా ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని నడుపుతున్న టిఆర్‌ఎస్ పార్టీ ఈ పరిస్థితి రాకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకొన్నది. తాము కోరుకొనే రాష్ట్రంలో ప్రజల మధ్య ఆంధ్ర, తెలంగాణ అన్న తేడాలు వుండవని పదే పదే ప్రకటనలు చేసింది. ఎన్నోసార్లు ఉద్రిక్తతలు చెలరేగే పరిస్థితులు తలెత్తినా, నిగ్రహం పాటించి, సామరస్య వాతావరణం నిలబెట్టింది. కానీ ఇప్పుడు పరిస్థితి వారి చెయ్యిదాటి పోతున్నది. అదుపు తప్పి పోతున్నది.

చాలా ప్రమాదకర పరిణామం ఇది. రాష్ట్ర పునర్విభజన లక్ష్యం, ప్రజల మధ్య ద్వేషాలు సృష్టించడం కాదు. రాష్ట్రం పేరు ఏదైనా అందరూ భారతపౌరులే. ఎవరు ఎక్కడైనా నివాసం వుండవచ్చు. తమకు నచ్చిన చోట నచ్చిన బ్రతుకు జీవనం వెతుక్కోవచ్చు. దాన్ని కాదనే హక్కు ఎవరికీ లేదు. ఇప్పటికే దేశంలో కుల, మత విద్వేషాలు సామాజిక జీవనాన్ని ఛిద్రం చేస్తున్నాయి. దానికి అదనంగా ప్రాంతీయ ద్వేషం తలెత్తితే ప్రజల జీవితాలు ఎంత చిన్నాభిన్నం అవుతాయో వూహించుకోవడం కష్టం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడాలని అక్కడివారు కోరుకొన్నది ఇందు కోసం కాదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో తెలంగాణ వాసుల పాత్ర, ప్రాధాన్యత తక్కువ కాబట్టి, ప్రభుత్వ నిధులు, నిర్ణయాలలో పాలకులు తెలంగాణ పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని; దానివల్ల తమ ప్రాంతం ఎంతో నష్టపోయిందని; తమకు స్వయం నిర్ణయాధికారం ఇస్తే ఈ కష్ట, నష్టాలను సరి చేసుకొంటామని తెలంగాణ వాదులు ఉద్యమించారు. తమ లక్ష్యానికి చేరువగా వచ్చారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆంధ్ర, తెలంగాణవాసులు కలిసి మెలసి పని చేసుకొంటేనే ఇరు పక్షాలూ అభివృద్ధి చెందే అవకాశం వుంటుంది. తెలంగాణలో తెలంగాణవాసులు మాత్రమే వుండాలనే సంకుచితతత్వం పాటిస్తే ఆ రాష్ట్రం వందేళ్లు వెనుకబడి పోతుంది. ఇది ఎవరూ కాదనలేని సత్యం. దీన్ని విస్మరించి, ఆంధ్ర, తెలంగాణవాసుల మధ్య విద్వేషాల చిచ్చు రగిల్చే ప్రయత్నం చేయడం ఆత్మహత్యా సాదృశ్యం. దానివల్ల ఎక్కువగా నష్టపోయేది తెలంగాణవాసులే అన్న నిజం విస్మరించరానిది.

ప్రత్యేక తెలంగాణ అంటే భారతదేశంలో మరొక కొత్త రాష్ట్రమే తప్ప, పాకిస్తాన్ వలె కొత్త దేశం కాదు. అక్కడ బ్రతికే ఆంధ్రుల పట్ల ప్రాంతీయ వివక్షత పాటించడం తెలంగాణ శ్రేయస్సు కోరుకొనే వారు చేయదగిన పనికాదు. ఇటువంటి దుష్ట పోకడలను మొగ్గ దశలోనే తుంచి, రెండు ప్రాంతాల మధ్య సామరస్య వాతావరణం నెలకొనే ప్రయత్నం చేయడం ప్రతి తెలంగాణ ఉద్యమకారుడి కర్తవ్యం. అందులో అలక్ష్యం చూపినా, వైఫల్యం చెందినా ప్రత్యేక రాష్ట్రం సాధించుకొన్న ఫలితాలు వారికి అందవు. చాలా చేదు అనుభవాలు మిగులుతాయి.

## జనవాణి

### వెనుకబాటు తనం ఇంగ్లీషు 'ప్రసాదం'

భాషా ప్రాతిపదికన ఏర్పడిన రాష్ట్రాలు ఆయాభాషలు మాట్లాడే జన సముదాయాల ప్రగతికి దోహదం చేయగలవన్న సిద్ధాంతం విఫలమైపోయిందనడానికి ప్రస్తుతం మన రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ఉదాహరణలు. దేశంపై మమకారం లేని ఖిల్జీలు, తుగ్లక్‌లు, ఆంగ్లేయులు వారి తర్వాత దళారీలు, దొరలు, జమీందారుల పాలనలో తెలంగాణ అనాధిగా వెనుకబడిపోయింది. మొత్తం మీద ఇక్కడ వెనుకబాటుతనానికి చారిత్రక నేపథ్యం విదేశీపాలనే. స్వాతంత్ర్యం వచ్చాక ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక ఇక్కడ గణనీయమైన అభివృద్ధి జరిగింది.... జరుగుతోంది. దీన్ని మాత్రం ఇక్కడి నేతలు స్వార్థ ప్రయోజనం కోసం వెల్లడించడమే లేదు. అదే సమస్యలకు మూలమవుతోంది.

కె.రమణయ్య, కావలి

### తలలేని కాంగ్రెస్ అధిష్టానం!

తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభిస్తామని కేంద్ర హోంశాఖా మంత్రి చిదంబరం అర్ధరాత్రి ప్రకటించి ప్రశాంతంగా వున్న ఆంధ్ర రాష్ట్రం అట్టుడికిపోయేలా చేశాడు. ఇటువంటి ప్రకటన చేసేముందు కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల నాయకుల అభిప్రాయం తెలుసుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీలోని కోర్ కమిటీకి లేదా? రాష్ట్రం నుంచి విడిపోవాలన్న భావన తెలంగాణ ప్రజలకు కూడా లేదన్న చిన్న సూక్ష్మాన్ని కాంగ్రెస్ పెద్ద తలకాయలు గ్రహించకపోవడం క్షమించరాని తప్పు. దీనికి ప్రాయశ్చిత్తమార్గాలే కానరావడం లేదు.

జి.నరేష్, నెల్లూరు.

### శాంభవిని పట్టించుకోకండి!

శాంభవిని బడికి పంపించకుండా, అదే వయసులో వున్న పిల్లలతో కలవనీయకుండా ఆమె తల్లిదండ్రులు ఆమె జీవితం నరకం చేస్తున్నారని హేతువాద సంఘాలవారు మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. కాని మీడియా ఆ అమ్మాయిని టీవీలు, పత్రికల ద్వారా ప్రచారం కల్పిస్తూ జనంలో మరింత ఆసక్తిని, మూఢభక్తిని పెంపొందిస్తున్నదని చెప్పక తప్పదు. శాంభవి వంటివారిని అసలు పట్టించుకోకపోతే వారు తెరవెనక్కిపోతారు.

పి.అరుణకుమారి, నెల్లూరు

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

22-12-1939
పేజీలు : 16 వెల: అణా

### కాంగ్రేసు భవనం

స్థలం కొన్న డబ్బే ఇంకా పూర్తిగా యివ్వలేదు గోపాలురెడ్డిగారు. ఇక్కడుండగానే ఈ కార్యనిర్వహణం పూర్తి చేయిస్తే మంచిది. స్థలం కొన్న డబ్బైనా శ్రీకృష్ణరావు పంతులు దండి యివ్వడా అని అడగ వచ్చునా?

### కాంచనమాల ధర

ఈవారంలో కాంచనమాల (సినీనటి) ధర 12 నుండి 15వేలకు పెరిగిందని తెలుస్తూంది. ఇంతకు మించి ఈ బొమ్మను ఆంధ్ర మార్కెటు భరించలేదు. ధర పెట్టడములో తమిళ మార్కెట్ ఎంతకైనా సిద్ధం. వాళ్ల చేతుల్లోకి పోతుందేమో ఈ తార?

### 7 1/2 లక్షలు

నెల్లూరు జిల్లా నుండి యిప్పటికి ఫిలిం వ్యాపారం మీద పెట్టింది కాని, పెట్టబోయ్యేది కాని షుమారు 7 1/2 లక్షలు కదా! 5 లక్షల పెట్టుబడితో వైవిరావు వంటి డైరక్టరు చేతి క్రింద ఒక ఫిలిం కంపెనీ స్థాపించి, స్టూడియో కట్టించి ప్రభాత ఫిలిం మాదిరి ఫిలిం నిర్మాణానికి పూనుకొంటే వరుసగా ఫిలిములు తీయవచ్చునే, ఎందుకు ప్రయత్నించకూడదు దశయ్యగారూ? ఈ జిల్లాలో ధనముంది. పూనుకొనే పెద్దలున్నారు. నిర్వహించే తలకాయలున్నవి. ఇక కూర్చువాడొంకడె కొదువ గాక!

### పైరు నాటుటకో యంత్రం

రైతులు చేతితో నాటు జరుపుట వలన ఆలస్యమగుటయే గాక, నారు చెడుచున్నది గావున గంటలో యెకరా ప్రదేశము నాటు యంత్రమును అమెరికా రైతులు వుపయోగించు చున్నారట. ఒకే విధముగా నాటును ఈ యంత్రము జరుపును. పంట హెచ్చుగుచున్నదట.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

18-12-1959
పేజీలు: 12 వెల: 0-3-0

### డాక్టరు పట్టాభి అస్తమయం

ఆంధ్ర అగ్రనాయకులు, అఖిలభారత కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు, కాంగ్రెస్ చరిత్రకారులు డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు కొంత కాలంగా అస్వస్థులుగా వుంటూ, ఈ నెల 17తేది ఉదయం హైదరాబాదులోని తన స్వగృహంలో దివంగతులైనారని తెల్పుటకు విచారిస్తున్నాము. చనిపోవునప్పటికి వారి వయస్సు 80 సంవత్సరాలు. డాక్టరు పట్టాభిగారి సతీమణి ఇదివరకే స్వర్గస్తులైనారు. వారికి యిద్దరు కుమారులున్నారు. ప్రథమ పుత్రుడు వెంకటరత్నం సహకారోద్యమంలో ముఖ్యుడు.

పట్టాభిగారి మరణవార్త శాసనసభ జరుగుతుండగా తెలియగానే సభను వాయిదావేసి, సభాధ్యక్షులు, మంత్రులు, ప్రతిపక్షనాయకులు పట్టాభి గృహానికి వెళ్లి వారి భౌతికదేహాన్ని సందర్శించి, భక్త్యంజలి ఘటించారు. తర్వాత శాసనసభ వారికి జోహార్లర్పించింది. లోక్‌సభ, రాజ్యసభలు కూడా పట్టాభి మరణానికి శ్రద్ధాంజలి సమర్పించినవి. దేశనాయకులందరూ సంతాప ప్రకటనలు జేశారు.

### మంత్రి మాట కంటే - కలెక్టరాఫీసు మాటే ఎక్కువ!

నెల్లూరు పరిషత్తును ప్రారంభిస్తూ వ్యవసాయ మంత్రి తిమ్మారెడ్డి, రెండు నెలల క్రితం తాను, రెవెన్యూమంత్రి నెల్లూరు, చిత్తూరు జిల్లాలలోని క్షామప్రాంతాలు చూచిపోయి చేసిన సూచనలపై ఈనాటికీ ఏలాంటి చర్య జరగలేదంటూ రెవెన్యూబోర్డుకు ప్రభుత్వానికి మంత్రి మాట కంటే కలెక్టరాఫీసు నుంచి వచ్చేదే వేదవాక్కుగా వుంటున్నాదన్నారు.

### స్వదేశం వచ్చిన ఏ.సి

యూగోస్లోవియా, ఇజ్రాయిల్ పర్యటనకు పోయి వుండిన ఏ.సి.సుబ్బారెడ్డి గారు తన పర్యటనను రద్దు జేసుకొని స్వదేశం తిరిగి వచ్చారు. వారు 16తేది ఢిల్లీ చేరారు. బహుశా ఈపాటికి హైదరాబాద్‌కు గూడా వచ్చి వుంటారు. క్రొత్త ముఖ్యమంత్రి ఎన్నిక దృష్ట్యా వారు పర్యటనను మధ్యలోనే రద్దు చేసుకొని వచ్చారు.

# తాగడం మానని నెల్లూరీయులు

**నెలకు 20 కోట్ల రూపాయల మద్యం తాగేస్తున్నారు**



బహిరంగ బ్రాందీ వ్యాపారం.

నెల్లూరీయులు మద్యం సేవించడం, ధూమపానం చేయడంలో సరికొత్త రికార్డులు నెలకొల్పుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. జిల్లాలో ప్రతి నెల 20 కోట్ల రూపాయల మద్యం వ్యాపారం జరుగుతుంటే, సిగరెట్, బీడీల వ్యాపారం కూడా 15 కోట్ల రూపాయల మేర జరుగుతుంది. మద్యం సేవించడం, ధూమపానం చేయడం హానికరమని మద్యం బాటిళ్లు, సిగరెట్, బీడీకట్టలపై ముద్రించినా ప్రయోజనం కానరావడం లేదు. గత ఏడాది 21 కోట్ల రూపాయల మద్యం వ్యాపారం జరగ్గా ఈ ఏడాది ఈ లక్ష్యం ఎప్పుడో దాటిపోయింది. మద్యం సేవించే వారి సంఖ్య ఎక్కువవుతుండడంతో గుండెపోటు, పక్షవాతం, కాలేయం చెడిపోవడం వంటి వ్యాధిగ్రస్తులు జిల్లాలో ఎక్కువవుతున్నారని డాక్టర్లు హెచ్చరిస్తున్నా పట్టించుకొనేవారు లేరు. కోస్తా జిల్లాల్లో సిగరెట్లు తాగడంలో నెల్లూరీయులే ప్రథమ స్థానం సంపాదించారు. వాస్తవానికి 18 ఏళ్ల పైబడిన వారికే సిగరెట్లు అమ్మాలన్న నిబంధన వున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో పదవ తరగతి చదివే పిల్లలు సైతం ఫ్యాషన్ కోసం సిగరెట్లు తాగి ఒళ్లు గుల్ల చేసుకొంటున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా నెల్లూరులో నాటు సారా, గంజాయి అమ్మకాలను ఎక్సైజ్‌శాఖ నిలువరించలేక పోతుంది.

• సమైక్యాంధ్ర కోసం

# శాంతియుత పోరాటం



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న చంద్రమోహన్‌రెడ్డి, ప్రక్కన ఎల్లసిరి గోపాలరెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి.

సమైక్యాంధ్ర కోసం జిల్లావ్యాప్తంగా దశలవారీ ఉద్యమాన్ని శాంతియుతంగా నిర్వహిస్తామని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు. 13వ తేది నెల్లూరు ప్రజారాజ్యం పార్టీ ఆఫీసులో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి సంయుక్తంగా విలేకరులతో మాట్లాడారు. సమైక్యాంధ్ర కోసం అన్ని పార్టీలు కలసి ఉద్యమాలు చేపడుతాయి. దీనికోసం దశలవారీ ఉద్యమ ప్రణాళికను రచించామన్నారు. 1969లో తెలంగాణ ఉద్యమం జరిగిందని, 1972లో జైఆంధ్రా ఉద్యమం చేపట్టారని ఆయా ఉద్యమాల నేపథ్యంలో ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పాటు చేసివుంటే ఇప్పుడు ఈ సమస్య వచ్చి వుండేది కాదన్నారు. రాష్ట్రాన్ని ముక్కలు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుంది. టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావును కూడా తమ సోదరునిగానే భావిస్తున్నామని ఆయన కూడా తెలుగువాడేనని ఆయన ఉద్యమాన్ని కించపరచడం తమ అభిమతం కాదన్నారు. జిల్లాలోని ప్రధాన పార్టీలన్నీ అహింసా మార్గాన స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో సమైక్యాంధ్ర ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని అఖిలపక్ష నేతలు స్పష్టం చేశారు.

• జిల్లాలో 47వేల మందికి హెచ్ఐవి పాజిటివ్

# పెచ్చుపెరుగుతున్న ఎయిడ్స్ రోగులు



జిల్లాలో ఎయిడ్స్ మహమ్మారి కోరలు చాస్తుంది. ఎన్ని ఎయిడ్స్ సంక్షేమ దినోత్సవాలు జరుపుతున్నా ఏటికేడాది జిల్లాలో ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరిగి పోతూనే వుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం జిల్లాలో 47వేల మంది హెచ్ఐవి పాజిటివ్ వ్యాధిగ్రస్తులున్నట్లు తాజాగా తేలింది. బయటకు వచ్చి పరీక్షలు చేయించుకోని వారితో కలుపుకుంటే ఈ సంఖ్య 55వేలు దాటినా ఆశ్చర్యపోనక్కరలేదు. ఎయిడ్స్ వ్యాప్తికి సురక్షితం కాని లైంగిక పద్ధతులు, పరీక్షించని రక్తాన్ని ఎక్కించడం, ఒకరు ఉపయోగించిన నీడిల్(సూది)ని మరొకరికి ఉపయోగించడం, తల్లి నుంచి బిడ్డకు వ్యాధి వ్యాప్తి చెందడం కారణమని చెప్పొచ్చు. ఐదవ నంబర్ జాతీయ రహదారితోపాటు నెల్లూరు నగరంలో పెచ్చుపెరిగిపోయిన వ్యభిచారం మూలంగా ఎయిడ్స్‌వ్యాధి చాప క్రింద నీరులా విజృంభిస్తుంది. తీరప్రాంతంతోపాటు నెల్లూరు నగరంలో ఎక్కువ మంది హెచ్ఐవి పాజిటివ్ రోగులున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వ్యాధి విజృంభించకుండా జనాన్ని చైతన్య పరిచే విధానాలు విఫలం కావడం వల్ల ఎయిడ్స్ భూతానికి ఎదురులేకుండా పోయిందని చెప్పక తప్పదు.

# పచ్చి మామిడి కాయ 20 రూపాయలు!



నోరూరించడం తప్ప తినేటట్టులేవు.

మాంసాహార ప్రియులు ఆదివారం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తుంటారు. ఆ రోజు రాగానే మార్కెట్‌లకు వెళ్లి తమ శక్తి మేర మటన్, చికెన్, చేపలు, రొయ్యలు కొనుగోలు చేస్తారు. అయితే మటన్, చేపలు, రొయ్యల పులుసు మంచి మజాగా వుండాలంటే ఈ కూరలో మామిడి కాయ వుండాల్సిందే. విచిత్రమేమిటంటే యేడాదిలోని అన్ని నెలల్లోనూ మార్కెట్‌లో పచ్చి మామిడికాయలు దొరుకుతున్నాయి. మహా ఎక్కువ రేటంటే కాయ పది రూపాయలు పలుకుతుండేది. అటువంటిది 13వ తేది వచ్చిన ఆదివారం ఒక్క మామిడికాయ 20 రూపాయల రేటు పలికింది. ఈ రేటు విని మాంసాహారులు ముక్కున వేలేసుకొన్నారు. 40 రూపాయలకు కిలో చింతపండు దొరుకుతుండగా ఇక మామిడికాయ ఎందుకని కొందరు రుసరుసలాడడం మార్కెట్‌లో కనిపించింది. కూరగాయల రేట్లు క్రూర గాయాలు చేస్తుంటే జనం ఏం తిని బతకాలి?



ఏ దేశ మేగినా ఎంతెత్తు కెదిగినా
జన్మభూమిని, 'జమీన్‌రైతు'ను
మరవక పోవడం
నెల్లూరీయుల సాంప్రదాయం

**పాఠకులకు ప్రత్యేక కానుక**

ఎనభైఏళ్లుగా 'జమీన్‌రైతు'ను తమ అభిమాన పత్రికగా ఆదరిస్తున్న పాఠకులకు ఈ కొత్త సంవత్సరంలో ప్రత్యేక కానుకగా "గ్లాస్" బౌల్ సెట్ అందిస్తున్నాము.
1-12-2009 నుండి 31-3-2010 మధ్య కాలంలో
చందా చెల్లించిన వారందరికీ ఈ కానుక అందుతుంది!

సంవత్సర చందా రూ.200/- | జీవిత చందా రూ.1000/-

చందా చెల్లించిన వెంటనే రశీదుతో పాటు కానుక అడిగి తీసుకోండి. ఇతర ప్రాంతాల నుంచి ఎం.ఓ. లేదా డి.డి. (చెక్కులు స్వీకరించబడవు) ద్వారా చందా పంపేవారు స్కీమ్ కాలపరిమితి ముగిసేలోగా మా కార్యాలయానికి వచ్చి కానుక స్వీకరించాలి. కానుకను పోస్టులో పంపడం సాధ్యం కాదు.

జమీన్‌రైతు

వెంకటరమణ హోటల్ మిద్దెపైన, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్: 0861-2327354

సాహసోపేత వార్తా చిత్రిక - జమీన్‌రైతు వారపత్రిక

# సమైక్యాంధ్ర వైపే నెల్లూరీయుల మొగ్గు

**ఎప్పుడూ కలవని నెల్లూరు నేతలను సమైక్యాంధ్ర ఉద్యమం ఒకటి చేసింది. అఖిలపక్షంగా ఏర్పడి దశలవారీగా జిల్లాలో వుద్యమాన్ని ఉధృతం చేస్తున్నారు.**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకోసం అనేక సంవత్సరాల నుంచి ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ ఆందోళనల ఫలితంగానే కాంగ్రెస్ అధిష్టానవర్గం దిగివచ్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు అంగీకరించింది. ఇక్కడ నుంచి రాయలసీమ, కోస్తా ఆంధ్రలలో సమైక్యాంధ్ర ఉద్యమం ప్రారంభమయ్యింది.

### శాంతియుతంగా ఉద్యమం



సమైక్యాంధ్ర కోసం చేస్తున్న ఉద్యమం శాంతియుతంగా కొనసాగించాలి. హింసకు తావులేకుండా అహింసా మార్గంలో వుండేందుకు మా వంతు కృషి చేస్తున్నాం. ఆంధ్ర ప్రాంతమంతా ఒక్కటేనన్న నినాదంతో ముందుకెళ్లడంతోపాటు తెలంగాణవాదులను రెచ్చగొట్టే విధంగా ఎటువంటి ప్రకటనలకు ఆస్కారం ఇవ్వరాదు. చిదంబరం చేసిన ప్రకటనకు నిరసనగా చెన్నైకు వెళ్లే తెలుగుగంగ నీరు ఆపామే తప్ప తమిళులపై కక్ష లేదు. సమైక్యాంధ్ర సాధించేందుకు అందరూ కలిసి రావాలి.

*సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జిల్లా టిడిపి అధ్యక్షుడు.*

### విధ్వంసాలకు పాల్పడరాదు!



సమైక్యాంధ్ర కోసం నిర్వహించే ఉద్యమం ప్రభుత్వ, ప్రయివేటు ఆస్తులకు ఎటువంటి నష్టం కలిగించకుండా కొనసాగించాలి. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ వుంటుంది. సమైక్యాంధ్ర లక్ష్యసాధన కోసం సాగే ఆందోళన కార్యక్రమంలో పార్టీలకతీతంగా అందరూ భాగస్వాములు కావాలి.

*ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు.*

### కలిసుండాలి!



బాషా ప్రయుక్త రాష్ట్రాలు విడిపోకూడదనే కోరుకుంటున్నాం. ప్రజలను రెచ్చగొట్టే విధంగా మా పార్టీ ప్రకటనలు చేయడం లేదు. అదేవిధంగా సమైక్యాంధ్ర కోసం నిర్వహించే ఆందోళన కార్యక్రమాలకు చాలా దూరంగా వుంటున్నాం. మిగిలినపార్టీల మాదిరి కాకుండా పార్టీ నిర్ణయానికి కట్టుబడి వున్నాం.

*టి.పి.భానురాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి*

### పార్టీ నిర్ణయం శిరోధార్యం!



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తీర్మానం పెడితే వ్యతిరేకించకూడదని పార్టీ నిర్ణయించింది. దీనికి వల్ల తెలంగాణకు వ్యతిరేకంగా మేము ఎటువంటి ఆందోళన కార్యక్రమాలు చేయబోము. అదేవిధంగా సమైక్యాంధ్ర వుండాలని నిర్వహించే ఆందోళన కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం లేదు. ఏది ఏమైనా పార్టీ నిర్ణయం మేరకు నడుచుకుంటాం.

*పముజుల దశరథరామయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి*

### సమైక్యాంధ్ర కావాలి!



తెలుగు మాట్లాడేవారందరికీ ప్రత్యేక రాష్ట్రం వుండాలి. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు వల్ల ప్రాంతీయ విబేధాలు తలెత్తే అవకాశం వుంటుంది. రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా కృషిచేయాలి. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ వ్యవహారమై మరోసారి పునరాలోచించాలి.

*సాయి సునీల్, ప్రజారాజ్యం పార్టీ.*

ఒక ప్రక్క తెలంగాణవాదులు మరోప్రక్క కోస్తాఆంధ్ర, రాయలసీమ వాదులు ఎవరికివారు ఆందోళనలు చేస్తూ బంద్‌లు పాటిస్తున్నారు.

తెలుగు మాట్లాడే వారందరికీ ఒకే రాష్ట్రం వుండాలన్న కోరికతో ఆంధ్ర, రాయలసీమ నేతలు, ప్రజలు ఆకాంక్షిస్తుండగా, గత 50 సంవత్సరాల నుంచి అన్నివిధాలుగా తెలంగాణ ప్రాంతం వెనుకబడి పోయిందన్న భావనతో ప్రత్యేక రాష్ట్రం కావాలని తెలంగాణకు చెందిన నేతలు, ప్రజలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో రెండు ప్రాంతాలకు చెందిన అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు తమ పదవులకు రాజీనామాలు కూడా చేయడం జరిగింది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటు ప్రకటన వెలువడిన నాటి నుంచి రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం ఏర్పడింది.

## ఆందోళనలు ఉధృతం

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ఎంత ఉధృతంగా ఆందోళనలు జరిగాయో సమైక్యాంధ్ర కోసం అదే విధంగా రాజకీయపక్షాలు, ముఖ్యంగా విద్యార్థి సంఘాలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సమైక్యాంధ్ర ప్రకటన వెలువడే వరకు ఆందోళనలు చేపడుతామని ప్రతిన బూనారు. ఇదిలా వుండగా ఆంధ్రా, తెలంగాణ ప్రాంతాలకు చెందిన నాయకులు పరస్పర ఆరోపణలు చేసుకుంటూ రెండు ప్రాంతాల వారిని మరింత రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ ప్రకటనలు చేస్తుండడం బాధాకరంగా వుంది. శాంతియుతంగా పరిష్కరించుకోవాల్సిన సమస్యను జటిలం చేస్తున్నారు.

తెలంగాణ ప్రాంతంలో ఆస్తులు కూడబెట్టుకొని, వ్యాపారాలు చేస్తున్న వారు కొందరు విద్యార్థి, యువజన సంఘాలను రెచ్చగొట్టి తమ పబ్బం గడుపుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ, జై ఆంధ్ర, సమైక్యాంధ్ర అంటే కూడా తేడా తెలియని నాయకులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ఇటీవల తెలుగు దేశం పార్టీకి చెందిన ఒక నాయకుడు తన అనుచరులతో నెల్లూరు గాంధీబొమ్మ వద్ద తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడం జరిగింది. ఈ ఆందోళన సందర్భంగా జైఆంధ్రా అని నినదించడం ఆశ్చర్యానికి గురి చేసింది.

దీనిని బట్టి రాష్ట్ర విభజన పట్ల వీరెంత అవగాహన కలిగి వున్నారో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణలోని కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు అధిష్టానం నిర్ణయాన్ని గౌరవించాలని కోరుతుంటే కోస్తా ఆంధ్రా, రాయలసీమకు చెందిన నేతలు ఉద్యమపథాన పయనిస్తున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అంగీకారం తెలిపిన యుపిఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ, హోం మంత్రి చిదంబరంలను ఎవరు విమర్శించడం లేదు. వారిపై ఆరోపణలు చేయడం, దిష్టిబొమ్మలను దగ్ధం చేయడం వంటి కార్యక్రమాలకు ఆ పార్టీ నేతలు దూరంగా వున్నారు.

అమరణ నిరాహారదీక్ష చేపట్టిన టిఆర్ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావుపై మాత్రం నిప్పులు చెరుగుతున్నారు. గ్రామ పంచాయితీ సర్పంచ్ దగ్గర నుంచి ఎమ్మెల్యేల వరకు సమైక్యాంధ్ర కోసం తమ పదవులకు రాజీనామాలు చేశారు. బిజెపి, సిపిఎం, సిపిఐ పార్టీల నేతలు మాత్రం కొంత తటస్థంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో జరిగే ఆందోళనలు, నిరసన కార్యక్రమాలకు దూరంగా వుంటున్నారు. ఆయా పార్టీల ఆదేశాల మేరకు ఆందోళన కార్యక్రమాలలో పాల్గొనడం లేదని తెలుస్తుంది.

ఈ క్రమంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు, సమైక్యాంధ్ర కావాలని ఉద్యమాలు చేస్తున్న రాజకీయపక్షాల నేతలు వెల్లడించిన అభిప్రాయాలను ప్రక్కనిస్తున్నాం.




నెల్లూరు గాంధీబొమ్మ వద్ద కాంగ్రెస్‌పార్టీ నేతృత్వంలో ఘంటానాద కార్యక్రమం.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న తెలుగుదేశం నాయకులు.



విఆర్‌సి వద్ద పిఆర్పీ నిరాహార దీక్షా శిబిరం.

# ప్రాజెక్టుల పనులకు అవరోధం

**• నిలబడిపోయిన వర్షపునీరు**

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాలలో నీరు నిలచి వుండడంతో పలు నిర్మాణాలకు, రాకపోకలకు అంతరాయం కల్గుతున్నది. ముఖ్యంగా ఈ వర్షపునీరు నిలబడిపోవడం వలన ముత్తుకూరు మండలంలో నిర్మిస్తున్న ప్రాజెక్టు పనులకు అవరోధం ఏర్పడింది. నేలటూరులోని జెన్‌కో విద్యుత్ ప్రాజెక్టు, కృష్ణపట్నంలోని రిలయన్స్ విద్యుత్ ప్రాజెక్టులలో ప్రస్తుతం లెవలింగ్ పనులు, కార్యాలయ నిర్మాణం, పైల్‌టెస్టింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో వర్షపునీరు నిలచి వుండడంతో నిర్మాణ పనులకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నీరు పోయే దారి లేకపోవడంతో బురదమయం అయ్యింది. కార్మికులు నడిచేందుకు, నిర్మాణ సామగ్రి తరలించేందుకు వాహనాలు తిరిగే పరిస్థితి లేకపోవడంతో పనులు ఆలస్యం అవుతున్నాయి. అనుకున్న సమయానికి నిర్మాణ పనులు జరిగేలా లేవని జెన్‌కో విద్యుత్ ప్రాజెక్టు అధికారులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. వీటితోపాటు మండలంలోని ఈపూరు, పంటపాళెం ప్రాంతాల్లో నిర్మాణంలో వున్న పామాయిల్ ఫ్యాక్టరీలకు కష్టాలు తప్పడం లేదు. నీరు నిలచినందు వల్ల పనులు జాప్యం కావడంతోపాటు అంచనా వ్యయం పెరిగే ప్రమాదం వుందని ఆందోళన చెందుతున్నారు నిర్వాహకులు.



సమైక్యాంధ్రను కోరుతూ నెల్లూరు పురవీధుల్లో ప్రదర్శన చేస్తున్న వి.ఆర్ కాలేజి విద్యార్థినీ, విద్యార్థులు.

# అర్బన్ హెల్త్ సెంటర్ వుండీలేనట్లే!

**జ్వరాలతో తల్లడిల్లుతున్న కావలీయులు**

కావలి పట్టణంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో ప్రజలు పలు రోగాల బారిన పడుతున్నారు. వైద్య చికిత్సల కోసం ఆస్పత్రులకు వెళ్తుంటే డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో పలు అవస్థలు పడుతున్నారు పట్టణవాసులు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అర్బన్‌హెల్త్ సెంటర్లను నెలకొల్పింది. అక్కడ వైద్యులు సరిగా విధులకు హాజరుకాకపోవడం రోగులకు శాపంగా మారింది. కావలి పట్టణం రాజీవ్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో ఈ పరిస్థితి ఎదురౌతోంది. ఈ హాస్పిటల్‌ను ఒక సేవా సంస్థకు అప్పగించారు. ఇక్కడ ఒక డాక్టర్, ఇద్దరు ఎఎన్ఎంలను నియమించింది. వీరికి జీతాలు సక్రమంగా అందజేయకపోవడంతో సిబ్బంది సరిగ్గా వైద్య చికిత్సలు అందించడం లేదు. డాక్టర్ వస్తే నర్సింగ్ సిబ్బంది వుండక, వీరు వుంటే డాక్టర్ అందుబాటులో వుండకపోవడంతో వివిధ రోగాల బారినపడి చికిత్సకు వచ్చేవారు అల్లాడి పోతున్నారు. ముఖ్యంగా సన్నజనం ఈ హాస్పిటల్‌పై ఆధారపడడం, ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకొనే శక్తి లేకపోవడంతో వైద్యం అందక పేదలు ఇబ్బంది పడాల్సి వస్తోంది.



ఆమంచర్లలో వృద్ధుల ఆశ్రమం నిర్వాహకురాలు జయా ఫిలిప్స్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న నెల్లూరులోని హెల్పింగ్ హ్యాండ్ సర్వీసు ఆర్గనైజేషన్ నిర్వాహకుడు టి.కృష్ణారెడ్డి దంపతులు.

# స్థానికుల పట్ల వివక్షత

**తడ ఈస్టర్న్ మ్యాట్రిస్ ఫ్యాక్టరీ తలబిరుసుతనం**

స్థానిక ఉద్యోగులపట్ల తడ మండలంలోని ఈస్టర్న్ మ్యాట్రిస్ ఫ్యాక్టరీ యాజమాన్యం అవలంభిస్తున్న పక్షపాత వైఖరిని కార్మికులు పెద్దఎత్తున నిరసిస్తూ ఆందోళనకు దిగారు. ఈ ఫ్యాక్టరీలో 170 మంది పనిచేస్తుంటారు. వీరిలో 70 మందికిపైగా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు వున్నారు. మిగిలినవారు కేరళ, ఒరిస్సా, బీహార్ ప్రాంతాలవారున్నారు. స్థానికులైన ఉద్యోగులకు తక్కువ జీతం ఇచ్చేయాజమాన్యం మిగిలిన రాష్ట్రాల వారికి అధిక జీతాలు చెల్లిస్తున్నాదని ఆరోపించారు. క్యాంటీన్‌లోను భోజనం తదితర విషయాల్లో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని, స్థానికులకు మొండిచేయి చూపుతున్నారని విమర్శించారు. యాజమాన్యం కేరళ రాష్ట్రానికి చెందిన వారైనందున వారికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇస్తూ జిల్లావాసులకు తగిన అర్హత వున్నా అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇవ్వకుండా తక్కువ వేతనాలు చెల్లిస్తూ వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఐఎన్‌టియుసి నాయకుడు కృష్ణారెడ్డి విమర్శించారు. స్థానికులకు మిగతా రాష్ట్రాల వారితో సమానంగా జీతభత్యాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.



నెల్లూరు కళ్యాణ్‌నగర్‌లో మంచినీటి పైపులైన్ల పనులను ప్రారంభిస్తున్న రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, నగర ఎమ్మెల్యే శ్రీధరకృష్ణారెడ్డి, మేయర్ భానుశ్రీ, కార్పొరేటర్ నరేంద్రరెడ్డి.


**ఉత్తరక్రియలు**



పంచేటి సుబ్బారావు
చల్లాయపాళెం

అమృతమూర్తి, మా అభివృద్ధికి మార్గదర్శి, దయార్ధ్రహృదయము, మానవత విలువలు కలిగిన మహోన్నత వ్యక్తి, నా తండ్రి గారైన **శ్రీ పంచేటి సుబ్బారావు** గారు తేది 09-12-2009 బుధవారము 6-45 గంటలకు స్వర్గస్తులైనారు. వారి పవిత్ర ఆత్మకు శాంతిని కలుగచేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

**ఉత్తరక్రియలు:** తేది 23-12-2009 బుధవారం ఉదయం పెద్దకర్మ బుచ్చిరెడ్డిపాళెం మండలం, చల్లాయపాళెం (చింతోపు) గ్రామంలోని మా స్వగృహము నందు జరుగును.

కుమారుడు : డా॥ పంచేటి ప్రసాదరావు, M.Sc., M.Phil, Ph.D అసోసియేట్ ప్రొఫెసర్, వి.ఆర్.కాలేజి, నెల్లూరు.
కోడలు : భాగలక్ష్మి
మనుమళ్లు : ఉదేష్, B.Tech., MBA, Software Engineer SAP, Hyderabad
లోకేష్, M.S New Mexico state University USA
మరియు కుటుంబ సభ్యులు


# విషజ్వరాల తాకిడి

వెంకటాచలం మండలంలో విషజ్వరాలు రోజురోజుకు తీవ్రతరం అవుతున్నాయి. మండలంలోని గొలగమూడిలో 70మందికి పైగా పలురకాల జ్వరాలతో అల్లాడుతున్నారు. పూడిపర్తి గ్రామంలోనూ విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ముఖ్యంగా డెంగ్యూ జ్వరం బారిన పడి పలువురు గ్రామ ప్రజలు ఆస్పత్రిల్లో చికిత్స పొందుతుండడంతో ఇతరులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గొలగమూడికి చెందిన పలువురికి డెంగ్యూ జ్వరం రావడంతో నెల్లూరులోని రామచంద్రారెడ్డి వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా వుండడం, దోమలు విపరీతంగా వుండడం, పందుల సంచారం, మురుగునీటితో ప్రజలు రోగాల బారిన పడుతున్నా వైద్యాధికారులు, స్థానిక గ్రామపంచాయితీ అధికారులు గాని పారిశుధ్యం పట్ల శ్రద్ధ చూపకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు.

# తగ్గిన నిమ్మ దిగుబడి

నిత్యం నిమ్మకాయల వ్యాపారులతో, నిమ్మకాయలు దిగుమతి చేసుకొంటూ కళకళలాడే పొదలకూరు నిమ్మయార్డు నేడు వెలవెలపోతోంది. ఈ ప్రాంతానికి రాపూరు, కలువాయి, సైదాపురం, పొదలకూరు, చేజర్ల, నెల్లూరు రూరల్ నుంచి రైతులు నిమ్మకాయలు తీసుకొని వస్తుంటారు. ఆత్మకూరు మార్కెట్‌లో ధరలు నచ్చని రైతులు సైతం ఇక్కడికే వస్తుంటారు. ఈ ప్రాంతంలో 30వేల ఎకరాల్లో సాగవుతున్న నిమ్మతోటలు నుంచి కాయలు వస్తుంటాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో పది లారీల నిమ్మను ఇతర రాష్ట్రాలకు పొదలకూరు మార్కెట్ యార్డు నుంచి ఎగుమతి చేశారు. ఈ ఏడాది మాత్రం రోజుకు ఒక లారీ ఎగుమతి చేయడం కష్టంగా వుంది. ఈ పరిస్థితుల్లో రైతులు నిమ్మసాగుపై విముఖత చూపడం, వర్షాలు సరిగా కురవకపోవడంతో నిమ్మ దిగుబడి గణనీయంగా పడిపోయి కూలీలకు పనులు లేకుండాపోయాయి.



కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఇందిరాభవన్‌లో కేక్ కట్ చేస్తున్న జిల్లాపరిషత్ మాజీ ఛైర్మన్ వెంచలబాబు. ప్రక్కన బాలసుధాకర్, రఘురాం, వందిల్లపల్లి అరుణమ్మ వున్నారు.

# వెంకటగిరి రైతుల్లో మార్పు!

ఇప్పటివరకు సాంప్రదాయ వ్యవసాయం చేస్తూ వచ్చిన వెంకటగిరి ప్రాంత రైతులు ఇప్పుడిప్పుడే ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. వరికోత యంత్రాల ముఖం కూడా చూడని ఈ ప్రాంత రైతాంగం విరివిగా వీటిని వినియోగిస్తున్నది. వరినాట్లు యంత్రాలతోనే వేశారంటే ఆధునిక వ్యవసాయం వైపు ఎంతగా మొగ్గు చూపుతున్నది అర్థమవుతుంది. వెంకటగిరి నియోజకవర్గం మెట్ట మండలాలతో కూడుకున్న ప్రాంతం. వర్షాధారంతో చెరువుల క్రింద వ్యవసాయం సాగించాల్సి రావడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. రబీ సీజన్‌లోత వరి, వేరు శనగ, ఖరీఫ్‌లో నువ్వు, పొద్దుతిరుగుడు, మినుము, పొగాకు, ముడిశనగలు పండిస్తున్నారు. గొట్టేరు, అలపలేరు, వెలికం టేరు తదితర ఆనకట్టలున్నా తగిన నిఘా లేకపోవడంతో

## ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు

రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. నియోజకవర్గంలోని పిగిలాం, కొత్తపాళెం చెరువుల తూములు కూరిపోయి మరమ్మత్తులు జరగని కారణంగా ఇటీవల కురిసిన వర్షాలకు గండిపడింది. కరిమెనగుంట, కాట్రాగుంట, తిక్కవరం తూములు దెబ్బతిని వున్నాయి. కడగుంట, చుట్టిగావాల చెరువులకు మరమ్మత్తులు చేయాల్సి వుంది. వీటికి మరమ్మత్తులు చేసి తగిన ప్రోత్సాహం అందించినట్లయితే ఆధునిక వ్యవసాయం ప్రారంభించిన రైతాంగానికి మరింత తోడ్పాటు నిచ్చినట్లవుతుందని ఈ ప్రాంతవాసులు అభిప్రాయ పడుతున్నారు.




అవినీతి రహిత సమాజాన్ని కాంక్షిస్తూ నెల్లూరు గాంధీబొమ్మ వద్ద కరపత్రాలు పంచుతున్న లోక్‌సత్తా పార్టీ నాయకులు శ్రీధర్, మణి, కె.రామారావు తదితరులు.

# దెబ్బతినిపోయిన బుచ్చిరోడ్డు!

## ప్రయాణీకుల లబోదిబో

బుచ్చిరెడ్డిపాళెం నుంచి నెల్లూరు వెళ్లే ముంబాయిరోడ్డు దారుణంగా దెబ్బతినిపోయింది. ఈ మార్గాన ప్రయాణించాలంటేనే వాహన చోదకులు హడలిపోయే పరిస్థితి నెలకొనింది. 1956లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి రాష్ట్రంలో వేయించిన మొదటి మూడు సిమెంటురోడ్లలో ఒకటైన ఈరోడ్డు నేడు ఛిద్రమై ప్రయాణీకులకు నరకాన్ని చూపిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలు, వాహనాల రాకపోకల వలన రోడ్డు అంతా గుంటలమిట్టలుగా తయారుకావడంతో ప్రధానమైన ఈ రోడ్డుపై ప్రయాణించాలంటేనే వాహన చోదకులు భయపడుతున్నారు. రెండునెలల క్రిందట వేసిన ప్యాచ్ పనుల తాలుకా ఆనవాళ్లు కూడా కన్పించనంతగా దెబ్బతిని పెద్ద పెద్ద గుంటలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు మరమ్మత్తులు కాంట్రాక్టర్లకు కాసులు కురిపించడం తప్ప పదికాలాలపాటు నిలిచేలా రోడ్డును నిర్మించకపోవడంతో తరచూ మరమ్మత్తులు చేపడుతున్నా రోడ్డు దెబ్బతింటున్నది. గతంలోనే ఈ రోడ్డు పాడైపోయినప్పుడు దానిని తొలగించడం కన్నా ఆ రోడ్డుపైనే తారురోడ్డు వేయడం మేలని భావించిన అధికారులు ఇప్పటివరకు ఆ విధానాన్ని అమలు చేస్తూ వస్తున్నారు. సాధారణంగా వేసవికాలంలో రోడ్డు మరమత్తులు చేపడుతుంటారు. కానీ ఇక్కడ వర్షాకాలంలో రోడ్డు వేయడం విమర్శలకు తావిస్తోంది.

NIPPO
BATTERIES TORCHES
+ Get more out of Life −




Technology from MATSUSHITA ELECTRIC Japan.

## 'జగన్నాటకం' తెలిసింది!



రాష్ట్రంలో సమైక్యాంధ్ర ఉద్యమానికి వైఎస్ తనయుడు జగన్మోహన్‌రెడ్డి పరోక్షంగా మద్దతిస్తున్నాడని, ముఖ్యంగా యూనివర్శిటీ విద్యార్థుల ఆందోళన వెనుక, జగన్ హస్తముందంటూ ముఖ్యమంత్రికి 'ఇంటెలిజెన్స్' నివేదిక అందింది. అయితే జగన్ ఎక్కడా బయటపడలేదు కాబట్టి ఈ విషయాన్ని సిఎం కూడా సీరియస్‌గా తీసుకోలేదు. కొందరు రాజకీయ నాయకులు 'జగన్'పై ఫిర్యాదు చేసినా కూడా రోశయ్య స్పందించలేదట. ఈ విషయమై తెలంగాణ కాంగ్రెస్ నాయకులు 'జగన్' ప్రవర్తనపై గుర్రుగా వున్నారు. అయితే మంగళవారం నాడు లోక్‌సభలో సమైక్యాంధ్ర కోసం తెలుగుదేశం ఎమ్పీలు నినదించినప్పుడు 'జగన్' కూడా వారితో శృతి కలిపాడు. అంతే కాకుండా సమైక్య రాష్ట్రం కావాలని రాసివున్న ప్లేకార్డును కావాలని ఒక దేశం ఎమ్పీ నుంచి తీసుకొని మరీ ప్రదర్శించాడట. దీంతో జగన్ అసలు రంగు బయటపడిందంటూ సభలో వున్న తెలంగాణ కాంగ్రెస్ ఎమ్పీలు మండిపడ్డారు. జగన్ ప్రవర్తన విపరీతంగా వుందంటూ వీరంతా అధిష్టాన నాయకులకు ఫిర్యాదు కూడా చేశారట. దీంతో ప్రణబ్‌ముఖర్జీ ప్రత్యేకంగా జగన్‌ను పిలిపించుకొని తీవ్రంగా మందలించాడట.

## స్పీకర్‌కు నిద్రలేని రాత్రులు



కిరణ్‌కుమార్‌రెడ్డి ఏ ముహూర్తాన స్పీకర్ స్థానంలో కూర్చున్నాడో కానీ కష్టాలు ఒకదాని వెంబడి మరొకటి తోసుకుంటూ వస్తున్నాయి. వైఎస్ వర్గీయుడిగా ముద్ర పడిన కిరణ్‌కుమార్‌రెడ్డి అభ్యర్థిత్వంపై తెలుగుదేశం పార్టీ తీవ్రంగా వ్యతిరేకించింది. అయినా వైఎస్ పట్టుబట్టి 'కిరణ్'ను స్పీకర్ స్థానంలో కూర్చోబెట్టించాడు. వైఎస్ ప్రమాదం తర్వాత 'సిఎం' స్థానం కోసం 'జగన్' చేసిన ప్రయత్నాల్లో కిరణ్‌కుమార్ ఒత్తిడికి గురికావాల్సి వచ్చింది. అయితే అధిష్టానం దయతో ఆ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. తిరిగి ప్రత్యేక తెలంగాణ, సమైక్యాంధ్ర రాష్ట్రాల వివాదంలో చిక్కుల్లోపడ్డాడు. అటు సీమాంధ్ర, ఇటు తెలంగాణ ఎమ్మెల్యేలు కొందరు రాజీనామాలు సమర్పించడం కిరణ్‌కు తలనొప్పిగా మారింది. పార్టీల రహితంగా ఎమ్మెల్యేలు ఆయా ప్రాంతాల వారీగా రాజీనామాలు సమర్పించి వాటిని ఆమోదించాల్సిందేనని పట్టుబడుతున్నారు. దీంతో ఎమ్మెల్యేలు లేక చివరకు అసెంబ్లీ సమావేశాన్ని కూడా వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల నుంచి బయటపడటానికి స్పీకర్ ఇప్పటికే నిపుణులతో సంప్రదించారు. ఈ గండం గడిచి బయటపడే వరకు పాపం స్పీకర్‌కు నిద్రలేని రాత్రులు తప్పేట్లు లేవు!!

## దీనిభావమేమి? నారాయణ??



సిపిఐ రాష్ట్రశాఖ ప్రధానకార్యదర్శి నారాయణకు ఎప్పుడూ వార్తల్లో వుండటమంటే ఎంతో ఇష్టం. దీనికోసం ఆయన ఏమైనా చేస్తాడు. గాంధీజయంతి నాడు చికెన్ తిని పెద్ద వివాదాన్ని సృష్టించాడు. ఎన్నికలకు ముందు తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీలు కలిసిపోటీ చేయాలని, అధికారాన్ని చెరి రెండున్నర సంవత్సరాలు పంచుకోవాలని వివాదాస్పద ప్రతిపాదన చేసి గబ్బుపట్టాడు. ఇపుడు ప్రత్యేక తెలంగాణకు మద్దతు ప్రకటించి సీమాంధ్ర జిల్లాల్లో వ్యతిరేకత పెంచుకున్నాడు. మంగళవారంనాడు రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సీమాంధ్ర పార్టీ కేడర్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం విషయంలో నారాయణను నిలదీశారు. దీంతో నారాయణ గొంతులో వెలక్కాయపడ్డట్లయింది. వెంటనే గొంతు సవరించుకొని సీమాంధ్ర ప్రజల మనోభావాల్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకోవాల్సిందేనంటూ ప్రసంగించాడు. ఆ సమావేశంలో వున్న తెలంగాణ ప్రాంత కేడర్‌కు ఇదేం అర్థంగాక ఇంతకూ నారాయణ ఉద్దేశం ఏమిటంటూ తలపట్టుకున్నారట!!

## పాపం దేవేందర్!



తెలుగుదేశం పార్టీలో ఒకప్పుడు నెంబర్‌టూగా ఓ వెలుగు వెలిగిన మాజీమంత్రి దేవేందర్‌గౌడ్ ఇప్పుడు ఒంటరిగా దిక్కుదిక్కుమంటున్నాడు. కెసిఆర్‌కు పోటీగా తెలంగాణవాదాన్ని నెత్తికెక్కించుకొని నవ తెలంగాణ పార్టీ పెట్టినా ఉపయోగం లేకుండా పోయింది. దీంతో ఆ పార్టీని ప్రజారాజ్యంలో విలీనం చేసినా ఫలితం దక్కలేదు. ఏ గూటి పక్షి ఆ గూటికి అన్నట్లు చివరకు దేవేందర్ తిరిగి తెలుగుదేశంలో చేరిపోయాడు. ఇప్పుడేమో తెలుగుదేశంలో కూడా తెలంగాణవాదానికి బలం చేకూరింది. నాగం జనార్దనరెడ్డి నాయకత్వంలో తెలంగాణ తెలుగు తమ్ముళ్లు వేర్పాటువాదాన్ని వినిపిస్తున్నారు. అయితే ఈ విషయంలో అందరికంటే ఆద్యుడైన దేవేందర్‌ను మాత్రం ఎవరూ మాటమాత్రంగా కూడా సంప్రదించడం లేదు. తాను తెలంగాణ వాదం ఎత్తుకున్నపుడు కలిసిరాని తెలంగాణ తమ్ముళ్లు ఇప్పుడు 'నాగం' జిందాబాద్ అంటుండడంతో దేవేందర్‌కు దిక్కుతోచడం లేదు. ఈ పరిస్థితుల్లో తానేం మాట్లాడాలో అర్థంగాక పాపం దేవేందర్ మౌనంగా వుంటున్నాడు. ఒకప్పుడు పార్టీ కార్యాలయంలో 'కింగ్'లా వుండే దేవేందర్‌ను ఇప్పుడు ఎవరూ పట్టించుకోకపోవడం కూడా ఆయన్ను బాధిస్తోందట! ప్చ్... పాపం దేవేందర్! అంటున్నారు చూసిన వారంతా?

## అటు అబ్బాయ్... ఇటు బాబాయ్!!



మంగళవారం నాడు అటు ఢిల్లీలో అబ్బాయి జగన్... ఇటు హైదరాబాద్‌లో బాబాయి వైఎస్.వివేకానందరెడ్డి సమైక్యాంధ్ర నాటకాన్ని రక్తికట్టించారు. లోక్‌సభలో జగన్ సమైక్యాంధ్ర సీన్ క్రియేట్‌చేస్తే, నేనేం తక్కువ తిన్నానా? అంటూ బాబాయి వైఎస్.వివేకానందరెడ్డి నగరంలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద దీక్ష పట్టాడు. ఒకేరోజు బాబాయి - అబ్బాయి ఇలా సమైక్యాంధ్ర అంటూ కూడ బలుక్కొని వార్తలకెక్కడం చర్చనీయాంశంగా మారింది. సమైక్యాంధ్రపై వైఎస్ వారసులు వ్యవహరిస్తున్న తీరు సమంజసంగా లేదంటూ తెలంగాణవాదులు దుయ్యబడుతున్నారు. వైఎస్ వర్గీయులుగా వున్న తెలంగాణ ఎమ్పీలు కూడా బయటపడి బాబాయి - అబ్బాయి వ్యవహారంపై మండిపడుతున్నారు.

## దేశం కొంపముంచిన ఆ ముద్దు



ఎమ్మెల్సీ నన్నపనేని రాజకుమారి వల్ల తెలుగుదేశం పార్టీకి తలనొప్పి ఎక్కువైంది. కొంతకాలంగా 'బాబు' మీద ఎడమొహం పెడమొహంగా వుంటున్న రాజకుమారి ఒకదశలో రాజీనామా చేస్తానంటూ బెదిరించింది కూడా. ఇప్పుడు తాజాగా కాంగ్రెస్ సమైక్యవాదుల శిబిరానికి వెళ్లి తెలుగుదేశంను ఇరకాటంలో పెట్టింది. విజయవాడలో ఎమ్పీ లగడపాటి రాజగోపాల్ సమైక్యరాష్ట్రం కోసం దీక్ష చేపట్టాడు. కాంగ్రెస్ మద్దతుదారులతో దీక్షా శిబిరం రద్దీగా వున్న సమయంలో అనుకోకుండా నన్నపనేని అక్కడ ప్రత్యక్షమయ్యారు. శిబిరంలోకి అడుగుపెట్టి లగడపాటి నుదుటిపై 'ముద్దు' పెట్టింది. దీంతో అక్కడున్న కాంగ్రెస్ మద్దతుదారులంతా బిగ్గరగా అరిచారు. సమైక్య ఆంధ్ర జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. రాజకుమారి కూడా వారితో శృతికలిపింది. పనిలో పనిగా సమైక్యరాష్ట్ర అవసరంపై సుదీర్ఘ ఉపన్యాసం కూడా చేసింది. ఈ విషయం తెలుసుకున్న చంద్రబాబుకు తల తిరిగినంత పనైందట. 'రాజకుమారికి చెప్పండయ్యా! ఇప్పటికే మన మీద బ్యాడ్‌గా వుంది. ఇలాంటి పనుల వల్ల మరింత చెడతా' మంటూ పక్కనే వున్న పార్టీ నాయకుల దగ్గర గొణిగాడట! రాజకుమారా? మజాకా? అనుకుంటున్నారు పార్టీ కార్యాలయంలోని పెద్దలు.

## రఘువీరా స్పీడ్‌కు రోశయ్య బ్రేక్



రాష్ట్రమంత్రి రఘువీరారెడ్డి స్పీడుకు రోశయ్య బ్రేక్ వేశాడు. మంత్రిమండలి సమావేశం సాక్షిగా ఈ సీన్ జరిగింది. అనంతపురం ఎస్కే యూనివర్సిటీ విద్యార్థులపై పోలీసుల లాఠీఛార్జి విషయాన్ని రఘువీరా మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించాడట. అయితే ఈ విషయమై అంతకుముందే సిఎం సమక్షంలో చర్చ జరిగింది. అయినా రఘువీరా పనిగట్టుకొని మళ్లీ దాన్ని ప్రస్తావించడంతో తెలంగాణ మంత్రులు కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారట. రోశయ్య కూడా వారితో శృతికలిపాడు. 'చూడు' రఘువీరా! ఈ విషయాన్ని మళ్లీ ఎత్తి రచ్చ చేయడం మంచిది కాదు. ఒకసారి మాట్లాడుకున్నాం. మళ్లీ మళ్లీ దానిపై మాట్లాడి భావావేశాలు పెంచుకోవడం దేనికి. నీకు మళ్లీ చెబుతున్నా జాగ్రత్తగా వుండు? అంటూ రోశయ్య కన్నెర్ర చేయడంతో రఘువీరా సర్దుకున్నాడట. అంతకు ముందే ఈ విషయమై అనంతపురం జిల్లా తెలుగుదేశం నాయకులు రోశయ్యను కలిసి పోలీసు అధికారి దారుసిన్హా బదిలీకి స్పష్టమైన హామీని కూడా పొందారు. దీంతో జనం దృష్టిలో పడటానికి రఘువీరా మంత్రివర్గ సమావేశంలో గొడవ చేశాడంటూ కొందరు మంత్రులు చెవులు కొరుక్కున్నారట.

## మంత్రుల రాజీనామాలు తూ... చ్...!



ప్రత్యేక రాష్ట్ర వాదాలకు అనుకూలంగా రాష్ట్ర మంత్రులు రాజీనామా చేశారంటూ కొన్ని రోజులుగా షికార్లు చేస్తున్న పుకార్లకు తెరపడింది. మంగళవారం నాడు జరిగిన రాష్ట్రమంత్రి మండలి సమావేశానికి మంత్రులందరూ హాజరయ్యారు. దీంతో ముఖ్యమంత్రి రోశయ్య 'హమ్మయ్యా!' అంటూ ఊపిరి పీల్చుకున్నారట. మామూలుగా మంత్రులెవరైనా రాజీనామా చేయాలనుకుంటే తమ రాజీనామా పత్రాలను ముఖ్యమంత్రికి సమర్పించాలి. కానీ కొందరు మంత్రులు పొట్టిశ్రీరాములు విగ్రహానికి, మరికొందరు అంబేద్కర్ విగ్రహానికి రాజీనామా పత్రాలు అందచేశారట. ఇంకొందరు ఫ్యాక్స్ ద్వారా గవర్నర్‌కు పంపారట. అయితే వీటికి చెల్లుబాటు వుండదన్న సంగతి మంత్రులకూ తెలుసు. ప్రజల్లో వెల్లువెత్తుతున్న భావోద్రేకాలకు అనుగుణంగా తాము రాజీనామాలు చేశామంటూ కొంతమంది మంత్రులు ప్రకటించుకున్నారు. తీరాచూస్తే ముఖ్యమంత్రికి ఒక్క మంత్రి రాజీనామా కూడా అందలేదట.

# నెల్లూరులో మొహరం పండుగపట్ల హిందువులకే ఆసక్తి ఎక్కువ!



పీర్లకు పుష్పాలంకారం

త్యాగానికి, ధీరత్వానికి ప్రతీక అయిన మొహరం పండగను నెల్లూరు జిల్లాలో హిందూ - ముస్లిం సోదరులు కలసికట్టుగా చేసుకొంటారు. ఓ రకంగా చెప్పాలంటే మొహరం పండగ పట్ల ముస్లింలకంటే హిందువులే ఆసక్తి చూపుతారు. ఈ పండగకు, నెల్లూరు బారాషహీద్ దర్గా వద్ద జరిగే రొట్టెల పండగకు సంబంధముండడమే దీనికి కారణమన వచ్చు. మొహరం పండగ చేసుకోవడం వెనుక పెద్ద చరిత్రే వుంది. ముస్లిం మత స్థాపకులు మహమ్మద్ (స) పరమపదించిన తర్వాత ప్రజాస్వామ్య పద్ధతిలో అరబ్బులు తమ ప్రతినిధిని ఎన్నుకోవడం మొదలెట్టారు. ఈయన్ను ఖలీఫా అని పిలిచేవారు. తొలి ఖలీఫాగా హజ్రత్ అబూబకర్ సిద్ధీఖ్ గారిని ఎన్నుకొన్నారు. ఆ తర్వాత హజ్రత్ ఉమర్, హజ్రత్ వుస్మాన్, హజ్రత్ అలీ గార్లు ఈ పదవిని అధిష్టించారు. ఐదవ ఖలీఫాగా ఇమామ్ హుసేన్‌ను 1400 సంవత్సరాల క్రితం ఎన్నుకొన్నారు. ఆ రోజుల్లో సిరియా గవర్నర్‌గా వున్న హజ్రత్ మావియా స్వార్థ రాజకీయ సలహాలతో అధికారం కోసం పోటీపడ్డారు. ఫలితంగా హుసేన్ - మావియా వర్గాల మధ్య యుద్ధానికి రంగం సిద్ధమయ్యింది. కానీ దయామయుడైన హుసేన్ రక్తపాతం వద్దని వెనుకకు తగ్గారు. మావియా ఖలీఫా అయ్యారు. అంతటితో ఊరుకోక తన కొడుకు యజీద్‌ను రాజుగా గుర్తించమని ప్రజలపై ఆయన ఒత్తిడి పెంచారు. ఈ విషయమై రాజ్యంలో అలజడి రేగింది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ వుద్యమం బయలుదేరింది. దీనికి ఇమామ్ హుసేన్ నాయకత్వం వహించక తప్పలేదు. రాజుతో చర్చలకు కుఫా నగరానికి బయలుదేరిన ఇమామ్ హుసేన్‌ను అడ్డుకోవడానికి మావియా పెద్ద సైన్యాన్ని పంపాడు. దీంతో ఇరువర్గాల మధ్య ప్రస్తుతం ఇరాక్‌లో వున్న కర్బలా మైదానంలో భీకర సంగ్రామం మొదలయ్యింది. చూస్తూ చూస్తూనే రోజులు గడిచిపోయాయి. కర్బలా మైదానం రక్తంతో ఎర్రబారింది. ఈ యుద్ధంలో తగినంత ఆహార సామగ్రి లేకపోవడంతో ఇమామ్ హుసేన్ అనుయాయులు ఒక్కొక్కరే అమరులవ్వడం మొదలయ్యింది. చివరికి ఇమామ్ హుసేన్ ఒక్కరే ఏకాకిగా మిగిలారు. అది మొహరం మాసం పదవరోజు; శుక్రవారం. అయినా హుసేన్ భారతంలో అభిమన్యుడిలా పోరాడుతూనే వున్నారు. సూర్యుడు పడమటి దిక్కుకు వాలాడు. హుసేన్ మగరీబ్ నమాజుకు సంసిద్ధులయ్యారు. సజ్దా (వంగి భూమికి తల ఆనించడం)లో వుండగా విషం పూసిన బాణాలు వేసి శత్రువులు ఆయన ప్రాణాలు తీశారు. ఆయన దేహం నుండి తలను, చేతులను ఖండించి బాణాలకు, బరిశెలకు తగిలించుకొని ఎగిరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, సమాజం నుంచి దుష్ట సంప్రదాయాలను, దురాచారాలను, స్వార్థ రాజకీయాలను పారద్రోలేందుకు ఇమామ్‌హుసేన్ ప్రజాస్వామ్య పునరుద్ధరణ వుద్యమానికి సారథ్యం వహించి ధర్మ సంస్థాపనా లక్ష్యంతో దైవ మార్గంలో ప్రాణాలొదిన స్మృతితో ముస్లింలు మొహరంను జరుపుకొంటారు. విషాదకరమైన పండగ మొహరం. మొహరం మాసంతోనే ఇస్లామియా నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. జిల్లాలోని ఉదయగిరి, నందవరం, ఆత్మకూరు, కాగితాలపూరు, అల్లూరు, నార్తుమోపూరులలో మొహరంను ఘనంగా జరుపుకొంటారు.

## ట్రంకు రోడ్డు కబుర్లు

### దొంగస్వామి



డిసెంబర్, జనవరి మాసాలలో అయ్యప్ప మాల ధారులు ఎక్కువగా కనపడతారు. సహజంగా ఈ స్వాములను చూస్తే భక్తి భావం వుప్పొంగుతుంది. ఈ బలహీనతను ఆసరాగా చేసుకొని ఓ ప్రొఫెషనల్ దొంగగారు అయ్యప్ప దీక్షా కంకణ ధారుల దుస్తులు ధరించి రైలెక్కి నెల్లూరు మహిళ మెడలోని 30 గ్రాముల బంగారు చైనును తస్కరించాడు. మద్యం మత్తులో కూడా వున్న ఇతని వ్యవహారశైలిపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొన్న రైల్వే పోలీసులకు ఈ దొంగస్వామి పెద్ద ఝలక్ ఇచ్చాడు. దొంగలించిన చైనును అమాంతం మింగేశాడు. పోలీసులు వదలుతారా? ఎక్సరే తీయించి విషయం నిర్ధారించుకొన్నాక ఆపరేషన్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు.

### స్కూటీ ఎక్కిన 'డిఎస్పీ'



బండెక్కి వచ్చావా... బస్సెక్కి వచ్చావా పాట గుర్తొచ్చిందేమో నెల్లూరు నగర డిఎస్పీ రాధిక ట్రాఫిక్ నడతను క్షుణ్ణంగా పరిశీలించను స్కూటీ ఎక్కారు. సందుగొందులు, ముఖ్యకూడళ్లను ద్విచక్ర వాహనంలో కలియ తిరిగారు. నెల్లూరు నగరంలో పద్మవ్యూహాన్ని తలపించే ట్రాఫిక్‌లో స్కూటీనే నడపడం ఎంతకష్టమయ్యిందో అర్థం చేసుకొన్నారు. సివిల్ డ్రస్‌లోనే ఆగిన ట్రాఫిక్‌ను ముందుకు నడపను డిఎస్పీ అక్కడక్కడ లాఠీ ఝళిపించక తప్పలేదు. డిఎస్పీని ఎరుగని వారు ఎవరీ అమ్మాయి హంగామా సృష్టిస్తుందని సణగడం వినిపించింది.

### ఫ్యాన్సీ నెంబర్ల పిచ్చి




ఎవరి పిచ్చి వారికానందం. చాలామందికి కార్లు, స్కూటర్లు, ఫోన్లకు ఫ్యాన్సీ నెంబర్లు పెట్టుకోవాలన్న పిచ్చి వుంటుంది. ఈ పిచ్చిని క్యాష్ చేసుకోను నెల్లూరు రవాణా శాఖాధికారులు ఫ్యాన్సీ నెంబర్ల కోసం టెండర్లు ఆహ్వానించారు. నవాబుపేటకు చెందిన సుకుమార్ ఎపి26-0008 నెంబరును 46వేలకు పాడుకొంటే, ఎపి26-0007 నెంబరును బాలాజీ నగర్‌కు చెందిన దిలీప్‌కుమార్ 40వేలకు కైవసం చేసుకొన్నాడు.

### మైనార్టీలకు పెళ్లిళ్లు



ముస్లిం మైనార్టీల్లోని పేద యువతులకు ప్రభుత్వం ఖర్చులు భరించిన నిఖాలు జరిపిస్తున్న విషయం అందరికీ విదితమే. గత నెలలో నెల్లూరులో జరిగిన ఈ నిఖాల్లోని పలు అవినీతికోణాలు బయటపడి 'అల్లారే' అనేట్లు చేశాయి. మైనార్టీ సోదరీమణుల నిఖాలని కాబోలు మైనార్టీ తీరని బాలికలకు సైతం ఇక్కడ వివాహాలు చేసిపారేశారు. అంతటితో ఊరుకోలేదు. గర్భవతులకు సైతం బురఖాలు కప్పి నిఖాల తంతు జరిపించారు. ప్రభుత్వం 20వేల రూపాయల విలువ చేసే జహేజ్ (కుటుంబ అవసరాల సామగ్రి) ఇవ్వడంతో బ్రోకర్లు రంగ ప్రవేశం చేసి మొత్తం మీద ఈ నిఖాలను గబ్బు పట్టించారు.

**జమీన్‌రైతు**
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

# గండవరంలో సమస్యల గుబురు

కొడవలూరు మండలంలోని గండవరం గ్రామ పంచాయితీ అభివృద్ధికి ఆమడ దూరంలో వుంది. ఈ పంచాయితీ అభివృద్ధికి నిధుల కొరత తీవ్రంగా వుంది. అధికారులు గానీ, ఇతర ప్రజాప్రతినిధులుగానీ పంచాయితీ అభివృద్ధిపై దృష్టిసారించడం లేదు. ఫలితంగా ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కోవూరు ఎమ్మెల్యేగా వుండిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హయాంలో పంచాయితీ అభివృద్ధికి కొంతమేర నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుత ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఏ పార్టీలో వుంటున్నారన్న విషయం తెలియక ప్రజలు సందిగ్ధంలో వున్నారు. పంచాయితీ అభివృద్ధికి సంబంధించి నిధులు కేటాయింపులో అన్యాయం జరుగుతుంది. గండవరం గ్రామ పంచాయితీ పరిధిలో 900 కుటుంబాలు, నాలుగు వేల జనాభా, 2500 మంది ఓటర్లు వున్నారు. 12 వార్డులు కలిగిన పంచాయితీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన బచ్చు డేవిడ్ సర్పంచ్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. వివిధ పన్నుల రూపంలో లక్షా 50వేలు, ఎస్ఎఫ్‌సి, 12వ ఆర్థిక సంఘం నిధులు కలిపి మరో లక్షా 50వేల రూపాయలు పంచాయితీకి విడుదలవుతున్నాయి. ఎమ్పీ, ఎమ్మెల్యేల గ్రాంట్ల నుంచి ఒకపైసా కూడా కేటాయించక పోవడంతో అభివృద్ధి పనులు చేపట్ట లేకపోతున్నారు.

పంచాయితీ గిరిజనులకు మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాలు పొలాల్లో నిర్మించడంతో వర్షం వస్తే రెండడుగుల లోతు నీరు చేరిపోతుంది. ఈ గృహాల్లోకి వెళ్లాంటేనే ఇబ్బందికరంగా వుంటుంది. అడిగే వారులేరన్న ధీమాతో గుంతలమయంగా వున్న పొలాల్లో స్థలాలు కేటాయించి గృహనిర్మాణం చేపట్టారు. నిర్మించిన పక్కాగృహాలు కూడా నాణ్యతగా లేవు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకానికి సంబంధించి ఒక్క పనికూడా ఇప్పటివరకు చేపట్టలేదు. అన్ని గ్రామ పంచాయితీలలో ఉపాధిహామీ పనులు చేపడితే ఈ పంచాయితీలో ఎందుకు చేపట్టలేకపోయారన్న దానికి సమాధానం లేదు.

గ్రామ పంచాయితీ పరిధిలో అంతర్గత రోడ్లు కూడా చాలా అధ్వాన్నంగా వున్నాయి. గండవరం నుంచి బుచ్చి రోడ్డు వరకు ప్రయాణించాలంటేనే నానా అవస్థలు పడక తప్పడం లేదు. ఈ క్రమంలో గ్రామపంచాయితీలోని సమస్యలు, జరిగిన అభివృద్ధిపై పలువురు వెల్లడించిన అభిప్రాయాలు ప్రక్కనిస్తున్నాం.



గండవరం గ్రామ పంచాయితీ కార్యాలయం.

### నిధుల కొరత వుంది



గ్రామ పంచాయితీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధుల కొరత వుంది. వివిధ పన్నులు, ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లతో అరకొర పనులు చేపడుతున్నాం. గ్రామ పంచాయితీలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు నా వంతు కృషి చేస్తున్నాను. త్రాగునీటి సరఫరా, పారిశుధ్యం మెరుగుపరిచేందుకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.గురుబ్రహ్మం, ఇన్‌ఛార్జి కార్యదర్శి.

### రోడ్లు అధ్వాన్నంగా వున్నాయి!



గ్రామ పంచాయితీ పరిధిలో అంతర్గత రోడ్లు చాలా అధ్వాన్నంగా వున్నాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా నడవలేని పరిస్థితి నెలకొని వుంది. రాత్రి పూట వీధిలైట్లు కూడా సక్రమంగా వెలగడం లేదు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పంచాయితీ అభివృద్ధిపై దృష్టిసారించాలి.

– శామ్యూల్, స్థానికుడు.

అవినీతి కథ

# ఎక్సైజ్‌శాఖలో ముదిరిన మామూళ్ల వివాదం!

నెల్లూరు డివిజన్ ఎక్సైజ్‌శాఖలో మామూళ్ల వివాదాలు పెచ్చుమీరాయి. బ్రాందీషాపులు, బెల్టుషాపుల నిర్వాహకుల నుంచి ప్రతి నెల లక్షలాది రూపాయలు ఎక్సైజ్‌శాఖకు మామూళ్ల రూపంలో అందుతుంటాయి. అయితే మామూళ్ల పంపకంలో ఎటువంటి విభేదాలు లేకున్నప్పటికి రాను రాను వాటాల పంపిణీలో వివాదాలు చోటు చేసుకొని, ఒకరిపై మరొకరు పరస్పర ఆరోపణలు చేసుకునేవరకు వెళ్లాయంటే ఇక్కడ పరిస్థితి ఎలా వుందో అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని శాఖల్లో కంటే అధిక ఆదాయం సమకూర్చేది ఎక్సైజ్‌శాఖ. దీనితర్వాత రవాణా, వాణిజ్య పన్నులశాఖలుంటాయి. ప్రభుత్వానికి ఎంత ఆదాయం సమకూర్చి పెడుతుందో ఆ శాఖలో పనిచేసే అధికార్లులు, సిబ్బందికి తగినవిధంగా ఆదాయ మార్గాలు చూపిస్తుంటుంది. కల్తీకల్లు, నాటుసారా తయారీదార్ల సమాచారం అందితే చాలు క్షణాల్లో వాహనాల్లో వెళ్లి అక్కడ వాలిపోతారు. నిందితులను అరెస్టు చేయకుండా వారి వద్ద నుంచి మామూళ్లు తీసుకుని వదిలేస్తుంటారన్న ఆరోపణలు సైతం ఎక్సైజ్ పోలీసులు ఎదుర్కొంటున్నారు.

**నెల్లూరు ఎక్సైజ్‌శాఖలో పనిచేసే కానిస్టేబుళ్లు సూపరింటెండెంట్ వివేకానందరెడ్డిపైనే వున్నతాధికారులకు ఫిర్యాదు చేశారంటే ఈ శాఖలో అవినీతి అక్రమాలు ఏ మేరకు పెరిగిపోయాయో అర్థం చేసుకోవచ్చు.**

ఉన్నతాధికారులు తాము చేసిన తప్పులు ఎక్కడ బయటపడతాయోనని భయపడి క్రిందిస్థాయి సిబ్బందిని కొన్ని సందర్భాలలో బలి చేస్తున్నారు. ఈ శాఖలో పని చేసే అధికారులు అనతికాలంలోనే కోటీశ్వరులవుతున్నారు. నెల్లూరు డివిజన్ ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ వివేకానందరెడ్డిపై క్రిందిస్థాయి కానిస్టేబుళ్లు ఒకరిపై ఒకరు ఆశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసుకొన్నారు. మద్యంలో కలిపే రెక్టిఫైడ్ స్పిరిట్ అనేక సంవత్సరాల నుంచి అక్రమ రవాణా జరుగుతుంది. స్పిరిట్‌ను అక్రమ రవాణా చేసే మాఫియాతో ఎక్సైజ్‌శాఖలో కొందరికి సన్నిహిత సంబంధాలు కలిగివున్న కారణంగా నిందితులను పట్టుకోలేకపోయారు.

స్పిరిట్ అక్రమంగా తరలించే వారిని పట్టుకోవాలన్న సంకల్పంతో కొందరు కానిస్టేబుళ్లు నిఘా ఏర్పాటుచేసి గత సంవత్సరం ఆగష్టు నెలలో 4వేల లీటర్లను పట్టుకున్నారు. కారుతో సహా పట్టుబడిన శివాజీరావు అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని నెల్లూరు నీలగిరి సంఘంలోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆఘమేఘాల మీద స్టేషన్‌కు వెళ్లిన సూపరింటెండెంట్ స్టేషన్‌కు ఎందుకు తీసుకువచ్చారని సిబ్బందిని ప్రశ్నించి అభిరామ్ హోటల్లో వుంచాలని ఆదేశించారన్నది అభియోగం. నిందితుడిని అరెస్టు చేసే విషయంలో సూపరింటెండెంట్‌కు ఎటువంటి సంబంధం లేకున్నా సన్నిహిత సంబంధాల కారణంగా హోటల్‌ల్లో వుంచి ముందస్తు బెయిల్ కోసం సహకరించాడన్న ఆరోపణలున్నాయి.

స్పిరిట్ అక్రమరవాణా చేస్తు పట్టుబడిన నిందితుడి నుంచి లక్షలాదిరూపాయలు చేతులు మారినట్లు సమాచారం. ఈ విషయం బయటకు పొక్కడంతో నిందితుడిని పట్టుకున్న కానిస్టేబుళ్లు సుధాకర్, గోపి అనే వారిని వేరే ప్రాంతానికి బదలీ చేశారు. ఎక్సైజ్‌శాఖపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపేందుకు ఆ శాఖ కమిషనర్ వీరేంద్రసింగ్ అనే డిప్యూటి కమిషనర్‌ను నియమించారు. ఈయన విచారణ చేపట్టేందుకు ఇటీవల నెల్లూరు వచ్చారు. ఈ సందర్భంలో కానిస్టేబుళ్లు, సూపరింటెండెంట్‌కు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వడంతో పాటు నిందితుడిని అభిరామ్ హోటల్లో వుంచిన విషయాన్ని బయటపెట్టి, రశీదులు చూపించారు.


అవినీతికి నిలయమైన ఎక్సైజ్ కార్యాలయం.

కానిస్టేబుళ్లను సూపరింటెండెంట్ వేధింపులకు గురి చేయడంతో దళిత సంఘాలు సైతం విచారణలో పాల్గొన్నాయి. హైదరాబాద్ నుంచి విచారణ కోసం వచ్చిన అధికారి సైతం సూపరింటెండెంట్‌కు సన్నిహితుడు కావడం విశేషం. మొత్తంమీద ఎక్సైజ్ శాఖలో మామూళ్ల వివాదం ఏస్థాయికి చేరుకుంటుందో ఆశాఖ ఉన్నతాధికారులకే తెలియాలి.

## ప్రజల మనోభావాలు తెలుసుకోలేదు



జడ్పీ ఛైర్మన్ ఆవేదన.

కేంద్రం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆలోచనకు ముందు గ్రామస్థాయిలో అన్నిప్రాంతాల ప్రజల, ప్రజానాయకుల మనోభావాలను తెలుసుకొని వుంటే బాగుండేదని జడ్పీఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 13వ తేది నెల్లూరు పొదలకూరురోడ్డులోని ఆయన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. సమైక్యాంధ్రతోనే అభివృద్ధి సాధ్యం. దీనికోసం గ్రామస్థాయి ఉద్యమాన్ని నిర్వహిస్తాం. గ్రామీణ ప్రజాప్రతినిధులతో ఈ విషయమై కార్యాచరణను రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ వ్యవహారంలో ప్రజాప్రతినిధులు చేస్తున్న రాజీనామాల్లో చిత్తశుద్ధి లేదన్నారు. ఒకసారి రాజీనామా చేస్తున్నట్లు నిర్ణయం తీసుకుంటే దానికి కట్టుబడి వుండాలన్నారు. సమైక్యాంధ్రకు భంగం కల్గితే జిల్లాలోని పంచాయితీరాజ్ ప్రతినిధులు నేరుగా జిల్లా కలెక్టర్‌కే రాజీనామాలు సమర్పిస్తామన్నారు. ఏ ఉద్యమానికైనా విద్యార్థులు ఊపిరని, వారిని పావులుగా వాడుకోవద్దని రాజకీయ పార్టీలకు జడ్పీ ఛైర్మన్ సూచించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీలు గోగుల వెంకయ్య, వీరి చలపతి, నారపరెడ్డి, అనిత, గిరిధర్, ఇందూధర్‌రెడ్డి పలువురు ఎమ్పీపీలు హాజరయ్యారు.

## చిల్లకూరుకు పాలపెత్తనం



విజయ డైరీ ఛైర్మన్ కానున్న చిల్లకూరు సుధీర్‌రెడ్డి.

20 ఏళ్లపాటు తెలుగుదేశం పెత్తనం క్రింద వున్న నెల్లూరు విజయ డెయిరీ ఛైర్మన్ పదవి మరోసారి కాంగ్రెస్ వశం కానుంది. రెండు దశాబ్దాలుగా సౌత్ ఆములూరుకు చెందిన ముప్పవరపు గోపాల కృష్ణయ్య చౌదరి పాల డెయిరీ ఛైర్మన్‌గా కొనసాగుతూ వచ్చారు. మధ్యలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బెజవాడ సురేష్‌రెడ్డి ఛైర్మన్‌గా ఎన్నిక కావడంతో గోపాలకృష్ణయ్య ఏకఛత్రాధిపత్యానికి బ్రేక్ పడింది. తర్వాత తిరిగి మళ్లీ ఆయనే కొనసాగుతూ వస్తున్నాడు. ఇప్పుడు పోట్లపూడికి చెందిన చిల్లకూరు సుధీర్‌రెడ్డి ఛైర్మన్‌గిరి సాధించనున్నారు. చాలా కాలంగా ఈ పదవి చేపట్టాలని ఉవ్విళ్లూరుతున్న ఆయనకు ఎప్పటికప్పుడు ఆటంకాలు ఏర్పడుతూ వచ్చాయి. మాక్స్ చట్ట పరిధిలోకి వచ్చిన తర్వాత కూడా గోపాలయ్యకే తోడుగా నిలవడంతో ఛైర్మన్ పదవి కాపాడుకోగలిగాడు. మొదటి నుంచి కాంగ్రెస్‌వాదిగా వున్న సుధీర్‌రెడ్డి చేతిచమురు వదిలించుకొనే వ్యక్తి తప్ప సంపాదించడం తెలియనివాడు. ఏ మాటనైనా కుండబద్దలు కొట్టినట్లు, ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తిత్వం. అదే ఆయనకు పలుమార్లు నష్టం చేసింది. అయినా ఆయన తన భగీరథయత్నాన్ని విడవకపోవడంతో ఎట్టకేలకు ఆదాల కృషితో ఆరు డైరక్టర్ల పదవులను హస్తగతం చేసుకొన్నాడు. వీటితో డైరక్టర్ల బలం కాంగ్రెస్‌కు 9, టీడీపీకి 6 చేరాయి. హోరాహోరీగా జరిగిన ఈ ఎన్నికల్లో సుధీర్‌రెడ్డి 82 ఓట్లు దక్కించుకొని ఛైర్మన్ పీఠంపై కూర్చునేందుకు సిద్ధమయ్యాడు.



నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సి.వి.శేషారెడ్డి.

## పిఆర్పీకి శేషన్న గుడ్‌బై!

### చిరంజీవిపై రుసరుస

ప్రజారాజ్యం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే సివి శేషారెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ విషయాన్ని 13వ తేది నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి చెప్పారు. మొదటి నుంచి నేను సమైక్యవాదిని. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిణామాలపై పార్టీ అధినేత నోరుమెదపక పోవడం తనను బాధించిందన్నారు. అందుకే రాజీనామా చేస్తున్నానన్నారు. టిఆర్‌ఎస్ నేత కెసిఆర్ కోరుతున్నట్లు ఆంధ్రప్రదేశ్‌ను విడగొడితే దేశసమగ్రత, సమానతలు దెబ్బతింటాయన్నారు. 1956లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడేందుకు అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం చేస్తే బూర్గుల కృష్ణారావు, రంగారెడ్డి వంటి నాయకులు మద్దతునిచ్చారు. రాష్ట్రస్థాయిలో బ్రహ్మానందరెడ్డి, బెజవాడ గోపాలరెడ్డి వంటివారు సమైక్యాంధ్రను బలపరిచారన్నారు. అలాంటి మహనీయుల త్యాగాలకు గుర్తుగా ఆంధ్రప్రదేశ్ సర్వతోముఖాభివృద్ధి చెందుతోందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు కలిసి వుంటేనే అభివృద్ధి సాధ్యమని సివి స్పష్టం చేశారు.

• ప్రజల మన్ననలు

## పొందిన చందన



చందన వార్షికోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న సినీనటి బిందుమాధవి.

రాష్ట్రంలోని షోరూంలలో చందన బ్రదర్స్ ప్రజల మన్ననలు పొందినదని చెప్పడంలో ఆలోచించాల్సిన అవసరమేలేదని సినీనటి బిందుమాధవి అభిప్రాయపడింది. 10వ తేది నెల్లూరు నగరంలో చందన బ్రదర్స్ 14వ వార్షికోత్సవాలను ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించింది. చందన బ్రదర్స్, సిఎంఆర్ షాపింగ్‌లలో అందరికీ అందుబాటైన ధరల్లో ఎప్పటికప్పుడు నూతన వెరైటీలు లభిస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఆఫర్లను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిఎంఆర్‌లోని వస్త్ర, నగల విభాగాలను ఆసాంతం పరిశీలించిన బిందుమాధవి అక్కడ తనను ఆకర్షించిన వస్త్రాలను పైన వేసుకొని, బంగారు నగలను ధరించి ఫోటోగ్రాఫర్లకు ఫోజిచ్చారు. ఈ కార్యక్రమంలో చందన బ్రదర్స్, సిఎంఆర్ షోరూంల అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య పాల్గొన్నారు.

## నెల్లూరు బంద్ విజయవంతం



బంద్ సందర్భంగా ట్రంకురోడ్డులో మూతబడ్డ దుకాణాలు.

సమైక్యాంధ్ర నినాదం సింహపురి వీధుల్లో మరోమారు మారుమ్రోగింది. తెలంగాణ రాష్ట్ర సమితి డిమాండ్‌కు తలొగ్గిన కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ తదితరులు అధికసంఖ్యాకుల అభిప్రాయాన్ని పరిగణలోనికి తీసుకోకుండా రాత్రికి రాత్రి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరంతో ప్రకటన చేయించడాన్ని ఎవరూ జీర్ణించుకోలేక పోయారు. అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీ నాయకులు, కార్యకర్తలు సంయుక్తంగా జిల్లా బంద్‌కు పిలుపునివ్వడంతో డిసెంబరు 12వ తేది బంద్ జరిగింది. ఉదయం నుంచే వివిధ పార్టీలవారు వీధుల్లోకి వచ్చి సమైక్యాంధ్రకు మద్దతుగా చేసిన నినాదాలతో నగరం దద్దరిల్లిపోయింది. యువజన కాంగ్రెస్, ప్రజారాజ్యం పార్టీ, తెలుగుదేశానికి చెందిన పలువురు యువకులు నగరంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రమేష్‌రెడ్డి, రాజీవ్‌భవన్ కాంగ్రెస్ నేతలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ తదితరులు బంద్ నిర్వహించారు. తెలుగు యువత నాయకుడు బీద రవిచంద్ర రైల్వేస్టేషన్‌కు చేరుకొని రైళ్లను నిలిపి సమైక్యవాదాన్ని గట్టిగా విన్పించారు. ఈ సందర్భంగా ఎలాంటి గొడవలు, గందరగోళాలు చెలరేగకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు. డిఎస్పీ రాధిక తన వాహనంలో నగరంలో కలియతిరిగారు. విద్యార్థి సంఘాలు కొంతమేర హడావిడి చేయడంతో కొన్నిచోట్ల స్వల్పంగా ఉద్రిక్తత తలెత్తింది. వేదాయపాళెం సెంటర్‌లో ఒక ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్సు అద్దాలను కొందరు పగుల గొట్టారు. కొన్ని ఆటోల అద్దాలు పగిలాయి. ఆత్మకూరు బస్టాండ్ వద్ద కిన్నెర ప్రసాద్ అనుచరులు కెసిఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అంతకు మించి బంద్ ప్రశాంతంగానే జరిగింది.



పొర్లపల్లి వాస్తవ్యులు వెంకటరమణయ్య మనుమడు భాస్కరరావు కుమారుడు ప్రదీప్, సింధూర లక్ష్మిల వివాహం డిసెంబర్ 2వేది తిరుపతిలో జరిగింది.

## రాష్ట్రపతి పాలనా?

మొదటి పేజీ కొరవ

తమను మోసం చేశాయని మథనపడుతున్నారు సోనియా, మన్మోహన్‌సింగ్‌లు. తెలంగాణా వేర్పాటు వాదం ఇప్పటికిప్పుడు పుట్టింది కాదు. చిదంబరం ప్రకటనతో వూపిరి పోసుకున్నది కాదు. పాత చరిత్ర పక్కన పెట్టినా, 2004 ఎన్నికల నాటి నుంచి కాంగ్రెస్ పార్టీలో అంతర్గతంగా నలుగుతూనే వుంది. ఆ ఎన్నికలలో తెలంగాణ ఇస్తామని సోనియాగాంధీ నోట పలికించాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి. ఆ తర్వాత ఎన్నోసార్లు ఆయన కూడా తాను అందుకు అనుకూలమే అని చెప్పాడు. ఏకాభిప్రాయం అని ఒకసారి, సోనియా గాంధీ నిర్ణయానికి వదిలి పెట్టామని మరొకసారి చెప్తూ, వెనక్కు నెడుతూ వచ్చారు. వైఎస్ మరణం తర్వాత కూడా సిఎల్పీలో ఈ అంశం చర్చకు వచ్చింది. నిర్ణయాధికారం సోనియాగాంధీకి వదలి పెడుతున్నట్లు ఏకవాక్య తీర్మానం చేసి పంపారు. ఈ సంఘటనలు, సందర్భాలు వేటిలోనూ కోస్తా, రాయలసీమ కాంగ్రెస్ నేతలు తాము తెలంగాణ ఇవ్వడానికి ఒప్పుకోమని చెప్పలేదు. సోనియా ఇస్తే, తమకు అభ్యంతరం లేదని మాత్రమే చెప్పారు. కానీ ఆమె ఆ నిర్ణయం ప్రకటించగానే తిరుగుబాటుకు దిగారు. ఈ ధిక్కారం సోనియాకు ఏ మాత్రం నచ్చడం లేదు.

మరొకప్రక్క తెలుగుదేశం, ప్రజారాజ్యం పార్టీలు కూడా అదే మోసపూరిత వైఖరి అవలంభించాయి. కెసిఆర్ దీక్షకు దిగిన తర్వాత తెలంగాణలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడడంతో ముఖ్యమంత్రి రోశయ్య అఖిల పక్ష సమావేశం జరిపితే ఆ రెండు పార్టీలూ తెలంగాణ ఇస్తామని శాసన సభలో తీర్మానం పెడితే తాము మద్దతిస్తామని చెప్పాయి. కానీ చిదంబరం ప్రకటన రాగానే దగా చేశాయి. వారికి తెలంగాణ ఇష్టం లేకుంటే, ఆ సమావేశంలోనే ఆ మాట చెప్పి వుండవచ్చు. రాష్ట్రంలో ఏకాభిప్రాయం లేదు కాబట్టి, మరి కొంతకాలం ఆగమని కెసిఆర్‌ను అభ్యర్థించి వుండేవారు. అందరూ సరే అన్నారనే నమ్మకంతో చిదంబరం ప్రకటన చేశాడు. ఆ వెంటనే అందరూ వెన్నుపోటు పొడిచి వెళ్లిపోయారు. దీన్ని జీర్ణించుకోవడం ఢిల్లీ పెద్దలెవరికీ అలివి కావడం లేదు. ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా ఆంధ్ర రాజకీయపార్టీలు వేటికీ నిజాయితీలేదని వ్యాఖ్యానించారంటే, పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### సోనియా ససేమిరా

తెలంగాణ ప్రక్రియ మొదలైందని తాము చేసిన ప్రకటనను ఉపసంహరించుకోవడానికి కానీ సవరించి సర్దుబాటు చేయడానికి కానీ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ఎంత మాత్రం సిద్ధంగా లేరని ఢిల్లీ వర్గాల భోగట్టా. ఒక జాతీయ పార్టీగా కాంగ్రెస్ అటువంటి తప్పుడు పని చేయలేదని ఆమె గట్టిగా చెప్తున్నారట. తెలంగాణ ఇవ్వడంలో భిన్నాభిప్రాయాలుంటే, ఆ ప్రక్రియలో ఆ సమస్య పరిష్కరించుకోవాలే తప్ప ఇచ్చిన మాటను వెనక్కు తీసుకొనే ప్రశ్నే లేదని తెగేసి చెప్తున్నారామె. జాతీయపార్టీగా అటువంటి పొరపాటు చేస్తే, భవిష్యత్తులో ఇతర్రా ఇటువంటి సమస్యలు ఉత్పన్నమైనప్పుడు తమ మాటకు విలువ వుండదని, విశ్వసనీయత లోపిస్తే వచ్చే అనర్థాలు ఇంతకంటే తీవ్రంగా వుంటాయని వాదిస్తున్నారామె. అందువల్లనే సీమాంధ్ర ఎమ్పీలు ఒకటికి రెండుసార్లు తనను కలిసి ప్రాధేయపడినా ఏ మాత్రం తొణకలేదు, వెనక్కు తగ్గలేదు.

### కుడితిలో పడ్డ ఎలుకలు

సోనియాగాంధీ అంత గట్టిగా తన వాదన మీద నిలబడతారని ఆంధ్ర నాయకులెవరూ వూహించలేదు. తెలంగాణతో సమానంగా తామూ గోల చేస్తే, ఆమె ఏదో ఒక సర్దుబాటు చేస్తారనే నమ్మకంతోనే రాజీనామా నాటకం మొదలు పెట్టారు. కానీ ఇప్పుడు పరిస్థితి చెయ్యి దాటిపోయింది. తెలంగాణ ఇవ్వబోమనే ప్రకటన కేంద్రం నుంచి రాకుండా రాజీనామాలు ఉపసంహరించుకొంటే, జనం రాళ్లతో కొడతారని భయం. అట్లని రాజీనామా ఆమోదం అంటే, ఏడు నెలలకే పదవీ భ్రష్టత్వం పడుతుందన్న బాధ. కుడితిలో పడిన ఎలుకల చందంగా వుంది ఎమ్మెల్యేల పరిస్థితి.

### సందట్లో చంద్రమాయ

సందట్లో సడేమియా అన్నట్లు, ఈ గొడవలతో మళ్లీ ఎన్నికలు తెప్పించాలని పాచికలు విసురుతున్నాడు చంద్రబాబు. తన పార్టీ తరపున సమైక్య ఆంధ్ర నినాదంతో రాజీనామా చేసిన 49 మంది ఎమ్మెల్యేలను స్పీకర్ మీదకు తోలుతున్నాడు. తమ రాజీనామాలను ఆమోదించాలని ఒత్తిడి పెంచుతున్నాడు. టిడిపి సభ్యుల రాజీనామాలు ఆమోదం పొందితే, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వెనక్కు వెళ్లడం కష్టం అవుతుంది. రాజకీయంగా అది వారికి చాలా నష్టం తెస్తుంది. పది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తే చాలు, ప్రభుత్వం మైనార్టీలో పడిపోతుంది. ఆ పరిస్థితులలో అసెంబ్లీని రద్దు చేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించక తప్పదన్నది చంద్రబాబు అంచనా. తెలంగాణ భావన అంతగాలేని ప్రాంతాలు, ఆంధ్ర, రాయలసీమలను కలుపుకొంటే 225 వరకు నియోజకవర్గాలు వస్తున్నాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, మెదక్ వంటి తెలంగాణా భావన ఉధృతంగా వున్న జిల్లాలలో పార్టీకి నష్టం వచ్చినా, ఈ 225 స్థానాలలో అధికభాగం తాను గెలుచుకోవచ్చునన్నది ఆయన వ్యూహం. అందుకోసం ఎన్నికలను ముందుకు రప్పించడానికి శతధా ప్రయత్నిస్తున్నాడు. తెలంగాణ కోసం ఒకటికి నాలుగుసార్లు ఎన్నికలు ఎదుర్కొన్న కెసిఆర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని తన ఎమ్మెల్యేలకు నూరి పోస్తున్నారాయన.

### స్పీకర్ అగచాట్లు

ఈ గొడవలు స్పీకర్ కిరణ్‌కుమార్‌రెడ్డిని సంకటంలో పెడుతున్నాయి. ఎమ్మెల్యేలు గట్టిగా ఒత్తిడి చేస్తే, రాజీనామాలు ఆమోదించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. న్యాయనిపుణులు సలహాలు, పరిశీలన వంటి కుంటి సాకులతో ఎక్కువ రోజులు సమస్యను నాన్చడం కుదరదు. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలి. రాజీనామాలను తిరస్కరిస్తే, అప్రజాస్వామికం అవుతుంది. అదే ఎమ్మెల్యేలు మళ్లీ రాజీనామాలు ఇస్తే ఆమోదించక తప్పదు. దానివల్ల కాంగ్రెస్ పార్టీ చాలా నష్టపోతుందని ఆయన ఆవేదన. కానీ చేయగల్గింది ఏదీ లేదు.

### రాష్ట్రపతి పాలన ఒక మార్గం

ఈ సమస్య నుంచి గట్టెక్కాలంటే, స్పీకర్ నిర్ణయం వెలువడే లోగా రాష్ట్రపతి పాలన విధిస్తూ కేంద్రం నుంచి ఉత్తర్వులు తెప్పించడమొక్కటే మార్గం. దానివల్ల కనీసం ఆరు నెలలు గడువు దొరుకుతుంది. అప్పటికి ఉద్రేకాలు చల్లారితే సమస్య లేదు. ఆరునెలల తర్వాత కూడా సమైక్య ఆంధ్ర వేడి ఉడుకు మిడుకుగా వుంటే అప్పుడు చూసుకోవచ్చు. అయితే రాష్ట్రపతి పాలనకు కేంద్రం సాహసిస్తుందా అన్నది ప్రశ్న. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నాయి కాబట్టి, ఆర్డినెన్స్ ద్వారా ఆ ఉత్తర్వు ఇస్తే, ప్రతిపక్షాలు గోల చేస్తాయి. లోక్‌సభలో బిల్లు పెడితే రచ్చరేగిపోతుంది. అందువల్ల సమావేశాలు ముగిసే వరకు వేచి వుండక తప్పదు. అన్ని రోజులు టిడిపి ఎమ్మెల్యేలు వూరుకుంటారా?

మొత్తం మీద చిదంబరం తెలంగాణ ప్రకటన రాష్ట్ర రాజకీయాలను అతలాకుతలం చేస్తున్నది. ఈ గండం నుంచి గట్టెక్కేదెట్లో ఎవరికీ అర్థం కావడం లేదు. దాదాపుగా అన్ని రాజకీయ పక్షాలు, నాయకులూ అయోమయంలో వున్నారు.

## జనవాణి

2వ పేజీ కొరవ

### జన్యుమార్పిడి వద్దు

ప్రకృతి ప్రసాదించిన వనరులన్నీ ప్రజలు, సమస్త జీవకోటి సుఖసంతోషాలతో జీవించడానికే. కానీ సైన్స్ పేరుతో కొన్ని విదేశీసంస్థలు కోట్ల రూపాయల లాభాలు సంపాదించడానికి నడుం కట్టాయి. ఇందులో భాగంగా జన్యుమార్పిడి ఆహార పదార్థాలను మార్కెట్లో ప్రవేశపెడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నాయి. యూరప్‌లోని 22 దేశాలు జన్యుమార్పిడి పంటలను నిషేధించాయి. ఇప్పటికైనా మన ప్రభుత్వం మేల్కొని బి.టి. వంకాయ పంటను మనదేశంలో పండించడాన్ని నిషేధించాలి.

దోగివర్తి సత్యం, అల్లూరు

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

మేయర్ భానుశ్రీతోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన 19మంది కార్పొరేటర్లు రాజీనామా చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన 13మంది, స్వతంత్ర కార్పొరేటర్లు ఐదుమంది రాజీనామాలు తనకు అందినట్లు కమిషనర్ ఆంజనేయులు చెప్పారు.

### టిడిపి ప్రజాప్రతినిధుల రాజీనామాలు

సమైక్యాంధ్రకు మద్దతుగా తెలుగుదేశంపార్టీ తరపున జడ్పీటీసీలుగా ఎన్నికైనవారు, కార్పొరేటర్లు తమ రాజీనామాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి 14తేది అందించారు. వాటిని ఆయన జడ్పీ సిఇఓ రామిరెడ్డి, నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్‌లకు పంపారు.

### రామనారాయణ ఇంటి ముట్టడి

సమైక్యాంధ్రకు మద్దతు తెలిపి తన పదవికి రాజీనామా చేయాలంటూ నెల్లూరు సంతపేటలోని పురపాలక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంటిని 15తేది విద్యార్థులు ముట్టడించారు. పోలీసులు లాఠీఛార్జీ చేయబోగా వారి బూట్లు పాలిష్‌చేయను సిద్ధపడడంతో వాళ్లు సైతం మౌనం వహించక తప్పలేదు. ముట్టడిలో టిఎన్ఎస్ఎఫ్, ఎబివిపి సంఘాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

### సోమవరపు రవి మరణం

కలివెలపాళెం గ్రామస్తుడు, స్నేహపాత్రుడు సోమవరపు రవీంద్రరెడ్డి 8తేది మరణించాడు. ఆయన వయస్సు 56 సంవత్సరాలు. బెంగుళూరులో వ్యాపారపరంగా ఎంతగానో వృద్ధిలోకి వచ్చిన శ్రీమంతుడు సోమవరపు ప్రభాకర్‌రెడ్డి, ఒకప్పటి సినీ నిర్మాత, స్నేహపాత్రతకు, మంచితనానికి మారుపేరైన సోమవరపు సుధాకర్‌రెడ్డి ఆయన సోదరులు. మద్రాసు ఆంధ్రా క్లబ్ అధ్యక్షుడు, కెన్సెస్ గ్రూప్ హోటళ్ల అధినేత కల్లూరుపల్లి నరసారెడ్డికి బావమరిది. చిన్న వయస్సులోనే అకాల మరణం పొందిన రవి కుటుంబానికి మా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాము.

## జగన్ స్వంత పార్టీ

మొదటి పేజీ కొరవ

రాజధానిలో రాజ్యం చేస్తున్నాయి. తెలంగాణ ఇచ్చి తమకు ద్రోహం చేసిందన్న కక్షతో ఆంధ్ర ప్రాంతం ప్రజలు కాంగ్రెస్‌ను శిక్షించవచ్చునని ఒక అంచనా. ముప్పాతిక భాగం మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మళ్లీ ఎన్నికలలో పోటీ చేయడానికి సిద్ధపడకపోవచ్చు. గెలుపు మీద విశ్వాసం లేకపోవడమే అందుకు కారణం. మరొకప్రక్క తెలంగాణలో కూడా కాంగ్రెస్ పరిస్థితి అంత సుకరంగా వుండదు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అయినా, తెచ్చింది కెసిఆర్ కాబట్టి, జనం ఆయన్నే వరించవచ్చు. తెలంగాణ భావనలేని హైదరాబాద్, ఖమ్మం వంటి ప్రాంతాలలో ప్రజలు కాంగ్రెస్ మీద మహా కోపంగా వున్నారు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు పోటీగా, కాంగ్రెస్‌వాదులతో, సమైక్య ఆంధ్ర నినాదంతో కొత్త పార్టీ పెడితే అధికారానికి చేరువ కావచ్చునన్నది జగన్ ఆలోచన. ఆంధ్ర జిల్లాలు, తెలంగాణ భావన లేని ప్రాంతాలలో దాదాపు 225 అసెంబ్లీ స్థానాలున్నాయి. వీటిలో సగం గెలుచుకోగలిగినా అతి పెద్ద పార్టీగా ముఖ్యమంత్రి పీఠం తనను వరిస్తుందన్నది జగన్ అంచనా.

లోక్‌సభలో తాను చేసిన చిన్న పొరపాటుకు ప్రణబ్ ముఖర్జీ వంటి సీనియర్ నేతలు తలవాచేట్లు చీవాట్లు పెట్టడం, తన తండ్రి దయ వల్ల ఎమ్పీలుగా గెలిచిన పొన్నం ప్రభాకర్ వంటి రాజకీయ అనామకులు కూడా తనను తిట్టి పోయడం జగన్‌కు తీవ్ర మనస్థాపం కల్గించింది. కాంగ్రెస్‌ను నమ్ముకొని, దాని పంచనే పడివుంటే ఇటువంటి అవమానాలు తప్ప అధికార పదవులు ఎప్పటికీ దక్కవన్న నిర్ణయానికి వచ్చేశాడాయన. ఈ లోక్‌సభ సమావేశంలోనే తన ఎమ్పీ పదవికి రాజీనామా చేసి, జనంలోకి వెళ్లి పోవాలని చూస్తున్నాడు జగన్.

ఇదిట్లా వుంటే, విజయవాడ ఎమ్పీ లగడపాటి రాజగోపాల్ కూడా ఇంచుమించు ఇదే ఆలోచన చేస్తున్నట్లు వినికిడి. ఎమ్పీ పదవికి రాజీనామా ఆమోదింపచేసుకొని, స్వతంత్రుడిగా నిలబడి తన పలుకుబడిని పరీక్ష చేసుకొనే ప్రయత్నంలో వున్నాడు రాజగోపాల్. అందులో సఫలీకృతుడైతే, తనకు తానుగా ఒక స్వంత పార్టీ పెట్టుకోవాలన్నది ఆయన ఆశ.

# ఉత్తరక్రియలు

నైనం చిన్దన్తి శస్త్రాణి నైనం దహతి పావకః|
న చైనం క్లేదయన్త్యాపో, న శోషయతి మారుతః||
(ఆత్మను ఆయుధాలు నరకలేవు, అగ్ని కాల్చలేదు, నీరు తడప లేదు, గాలి ఎండబెట్టనూలేదు.)



జననం
14.02.1953

మరణం
08.12.2009

## శ్రీ సోమవరపు రవీంద్రరెడ్డి గారు

పెనుబర్తి - నెల్లూరు.

నిరంతరం శ్రమకోర్చి మా అందరిని ఉన్నత శిఖరాలకు చేర్చిన మీరు మమ్మల్ని దుఃఖ సాగరంలో ముంచి 8.12.2009 మంగళవారం నాడు తిరిగిరాని లోకాలకు తరలి వెళ్లారు. మీరు మాపై చూపిన ప్రేమానురాగాలు మా హృదయాంతరాలలో పదిల పరుచుకొంటాం.

దివి నుంచి మీ ఆశీస్సులు సదా మాకు ఉండాలని కోరుకుంటూ....

మీ ఆత్మశాంతికై భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య : సోమవరపు ఝాన్సీ

| కుమారుడు | కుమార్తె - అల్లుడు | మనుమడు, మనుమరాలు |
| --- | --- | --- |
| సోపవరపు బలరామిరెడ్డి | మాలిని - వై.ఎస్. అనిల్‌రెడ్డి | వై.ఎస్. సజీవ్‌రెడ్డి, వై.ఎస్.శ్రేయ |

**పెద్దకర్మ :** నిలుపు: 23.12.2009 బుధవారం, ఎత్తురేవు: 24.12.2009 గురువారం
నెల్లూరు, రామ్మూర్తినగర్‌లోని మా స్వగృహమునందు జరుగును.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.